రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 41.0 (శుక్రవారం)
కనిష్ఠం : 27.0


కాకినాడలో డీఎస్సీ అభ్యర్థినుల తనిఖీ..

డీఎస్సీ
30వ తేదీ వరకు పరీక్షలు
తొలిరోజు 310 మంది గైర్హాజరు

కాకినాడరూరల్/అమలాపురం రూరల్/రాజమహేంద్రవరం అర్బన్, జూన్6(ఆంధ్రజ్యోతి): ఏపీ మెగాడీఎస్సీ-2025 ఆన్‌లైన్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు ఈనెల 30వ తేదీ వరకూ కొనసాగనున్నాయి. తొలిరోజు అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి గంటన్నర ముందు అనుమతించారు. మొదటిగా అభ్యర్థుల హాల్‌టికెట్‌తోపాటు ఫొటో గుర్తింపును పరిశీలించారు. రాజమహేంద్రవరం ఐయాన్ డిజిటల్ జోన్ ఐడీజీ లూథర్‌గిరి రాజీవ్‌గాంధీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్‌లో శుక్రవారం జరిగిన మెగా డీఎస్సీ పరీక్షలకు 1200 మంది దరఖాస్తు చేసుకోగా 1,059 మంది హాజరయ్యారని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఉదయం సెషన్‌లో 600 మందికిగాను 532 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 600 మందికిగాను 527 మంది హాజరయ్యారని కలెక్టర్ వెల్లడించారు. పరీక్షల నిర్వహణ తీరును కలెక్టర్ తనిఖీ చేశారు. కాకినాడ జిల్లాలో ఉదయం ఐదు కేంద్రాల్లోనూ, మధ్యాహ్నం ఒక కేంద్రంలోనూ జరిగినట్టు డీఈవో పి.రమేష్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి 12 వరకూ నిర్వహించిన పరీక్షకు 842 మంది హాజరుకావాల్సి ఉండగా 756 మంది, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 182 మంది హాజరుకావాల్సి ఉండగా 137 మంది హాజరయ్యారు. మొత్తం రెండు సెషన్లకు కలిపి 1024 మందికి 893 మంది హాజరుకాగా 131 మంది గైర్హాజరైనట్టు తెలిపారు. కోనసీమ జిల్లాలో తొలిరోజు శుక్రవారం డీఎస్సీ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని డీఈవో షేక్ సలీంబాషా తెలిపారు. అమలాపురం రూరల్ మండలం భట్నపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన తొలిరోజు మొదటి సెషన్ పరీక్షకు 18 మంది అభ్యర్థులు హాజరు కాలేదన్నారు. కాట్రేనికోన మండలం చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన పరీక్షలకు 20 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారన్నారు. తొలిరోజు రెండు కళాశాలల్లో మొదటి సెషన్ పరీక్షలు మాత్రమే నిర్వహించామన్నారు.


రాజమహేంద్రవరంలో డీఎస్సీ అభ్యర్థినుల తనిఖీ..పరీక్షా కేంద్రంలో కలెక్టర్ ప్రశాంతి పరిశీలన.. రూమ్ నెంబర్ చూస్తున్న అభ్యర్థులు
నాన్న తోడుగా..
ఉండమ్మా.. పరీక్ష రాసి వచ్చేస్తా..


రాజమహేంద్రవరంలో విజ్ఞాన కేంద్ర భవనం

అద్భుతమే కానీ..!
విజ్ఞాన కేంద్రం చూద్దామంటే దారేది

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)
అదొక అద్భుతం..అయినా ఎందుకో నిర్లక్ష్యం.. నాడు వైసీపీ ప్రభుత్వంలో కోట్లు ఖర్చు పెట్టారు.. ఎందుకు కొరగాకుండా వదిలేశారు..పోనీ కూటమి ప్రభుత్వంలో అయినా పట్టించుకుంటా రనుకుంటే ఎందుకో మరి వదిలేశారు..ఎప్పుడో డిసెంబరు రెండో వారంలో అనుకుంటా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వస్తారు..ప్రారంభిస్తారని హడావుడి చేశారు.. నేటికీ ఆరంభమే కాలేదు.. కోట్లు ఖర్చు చేసి బొమ్మూరులో నిర్మించిన రాజమండ్రి విజ్ఞాన కేంద్రం (సైన్స్ మ్యూజియం) ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. ఈ నెల 10 లేదా 12 తేదీల్లో సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- నేటికి ప్రారంభంకాని సైన్స్ మ్యూజియం
- 2019లోనే నిర్మాణ పనులు ఆరంభం
- వైసీపీ హయాంలో పూర్తయిన పనులు
- గతంలో పవన్ ప్రారంభిస్తారని ప్రచారం
- నిరుపయోగంగా మారిన విజ్ఞానం
- సీఎం చంద్రబాబు రాక..మళ్లీ ఊహాగానాలు


గ్రౌండ్‌లో డైనోసార్ బొమ్మ... ఇలాంటివి ఎన్నో..

సమస్య ఉన్నా కట్టేశారు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సైన్స్ మ్యూజియం నిర్మాణానికి బొమ్మూరులో సుమారు 5 ఎకరాల స్థలం కేటాయించారు. రోడ్డు కంటే బాగా పల్లంగా ఉంటుంది. దీనిని మెరక చేయడానికి అప్పటి ఎంపీ మాగంటి మురళీమోహన్ మట్టి కూడా ఏర్పాటుచేస్తామని చెప్పారు. తర్వాత ప్రభుత్వం మారింది. అవేమీ పట్టించుకోలేదు. పల్లపు ప్రాంతంలోనే నిర్మించారు. దీనిని సరిదిద్దడానికి జిల్లా అధికార యంత్రాంగం నానా తంటాలు పడ్డారు. ప్రస్తుతం విలువైన ఈ విజ్ఞాన కేంద్రం పల్లపు ప్రాంతంలోనే ఉంది. కానీ ప్రహరీ చుట్టూ డ్రెయిన్లు తవ్వారు. ప్రహరీ లోపల, విజ్ఞాన కేంద్రం చుట్టూ వానపడినా లోపలకు నీరు వచ్చే ప్రమాదం ఉంది. అంత పల్లంగా ఉంటుంది. దీనికోసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేసి, వాన నీటిని మళ్లించే ఏర్పాట్లు చేశారు. ఎంత చేసినా ఈ విజ్ఞాన కేంద్రానికి ఇది సమస్యే. దీని నిర్మాణ సమయంలో ఏపీ కాస్ట్ అధికారులు కనీస పర్యవేక్షణా చేయలేదు. సైట్ ఆఫీసర్‌ను నియమించలేదు. డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన ఒక సూపర్‌వైజర్ నెలకో, రెండు నెలలకో ఒకసారి వచ్చేవారు. దీంతో ఇక్కడ సమస్యగా మారింది. దీంతో ఈ కేంద్రం ఎలా తెరవాలో తెలియక ప్రస్తుత ప్రభుత్వంలో మల్లగుల్లాలు పడుతోంది.. తెరిస్తే నిర్వహణ కష్టంగా ఉండనుంది. తెరవకపోతే విజ్ఞానం మూలనపడిపోతోంది. ఈనెల 12న సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో అధికారులు ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేసే అవకాశం ఉంది.

పనులు ఆరంభం 2019

2017లో మంజూరైన రాజమండ్రి విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి 2018 ఫిబ్రవరి 18న అప్పటి ఎంపీ మాగంటి మురళీమోహన్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి శంకుస్థాపన చేశారు. రూ.16.82 కోట్లు అంచనా వ్యయంతో టీడీపీ ప్రభుత్వ హయాంలో 2019 ఫిబ్రవరిలో పనులు ప్రారంభించారు. కానీ ఎన్నికల సీజన్ కావడంతో పని జాప్యమైంది. ఆ తరువాత ప్రభుత్వం మారడంతో చాలాకాలంపాటు దీని ఊసే మరచిపోయారు. తరువాత ఎన్నికల ముందు హడావుడిగా పనులు ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వంలో ఏ పనిచేసినా గందరగోళమే. సైన్స్ మ్యూజియం పరిస్థితి కూడా అంతే. కోట్లు ఖర్చు పెట్టి కట్టారు వదిలేశారంతే.. నేటికి వినియోగంలోకి రాకుండా ఉంచేశారు. 2019లో ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి వచ్చింది. అప్పటికే మ్యూజియం నిర్మాణ పనులు ప్రారంభమైనా రివర్స్ టెండరింగ్ నేపథ్యంలో నిలిచిపోయాయి. సుమారు మూడేళ్లపాటు పనులు ముందుకు కదల్లేదు. నిధులున్నా పనులు నీరసమే. ఆ తరువాత పనులు ఆరంభించినా తూతూ మంత్రంగా చేసి వదిలేశారు.


భవనం లోపల ఉండే రకరకాల యంత్రాలు


నీటి ప్రయోగశాల

లోపలంతా అద్భుతః

ఈ విజ్ఞాన కేంద్రం చాలా బాగుంటుంది. లోపల ఒక అద్భుతమే. సైన్స్‌కు సంబంధించిన పరికరాలు.. ప్రయోగాలు ఏర్పాటుచేశారు. విద్యార్థులకు ఎంతో ఉపయుక్తం కూడా. ఇది జీప్లస్ 1గా నిర్మించారు. గ్రౌండ్‌లో మూడు రూమ్‌లు ఉన్నాయి. ఫస్ట్ ఫ్లోర్‌లో 6 గ్యాలరీలు ఉన్నాయి. ఆడిటోరియం, కాన్ఫరెన్స్ హాల్ ఉంది. సాంకేతికపరమైన 18 ఎగ్జిబిషన్లు ఉన్నాయి. ఓపెన్ గ్రౌండ్‌లో సైన్స్ పార్కు ఉంది. రన్ నియన్స్ గాలరీలో ఫిజిక్స్, మ్యాథ్స్‌కి సంబంధించి 33 విజ్ఞాన అంశాలు ఉన్నాయి. అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించిన మరో నిర్మాణం చేయనున్నారు. వాటర్ వర్రీస్ గ్యాలరీలో వర్చువల్ మ్యూజియం, మరో 35 ఎగ్జిబిషన్లు ఉన్నాయి. చిత్రాల సౌండ్ ఫైల్‌ల సేకరణ, ఖగోళ వస్తువులు, సాంకేతిక, శాస్త్రీయ, పారిశ్రామిక పురోగతికి సంబంధించిన 32 ప్యానెల్‌లు ఉన్నాయి. అజర్నీ విత్ లైట్ పై స్పేస్, గెలాక్సీ, సౌర వ్యవస్థ, గ్రహాలతో కూడిన 20 ప్యానెల్స్ ఉన్నాయి. డ్రోన్లు, రోబోల టెక్నాలజీని చెప్పడం కోసం రోబోటిక్ ల్యాబ్ ఉంది. ఈ విజ్ఞాన కేంద్రం అధికారిగా ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఒకరు, నలుగురు ఎడ్యుకేషనల్ ఆఫీసర్లు, టెక్నీషియన్ ఒకరిని నియమించారు. హౌస్‌కీపింగ్, సెక్యూర్టీ, ఆఫీసుబాయ్‌తో కలిపి 16 మంది పనిచేస్తున్నారు.

డీసీసీబీ చైర్మన్‌గా తుమ్మల బాబు

కాకినాడ రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : కాకినాడ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)పర్సన్ ఇన్‌ఛార్జిగా తుమ్మల రామస్వామి (బాబు) శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఏకాదశి మంచి ముహూర్తం కావడంతో ఉదయం 7.30 గంటల సమయంలో బాధ్యతలు స్వీకరించగా సీఈవో నరసింహారావు సంతకాలు చేయించారు. డీసీసీబీకి ఇప్పటి వరకూ జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ప్రత్యేక అధికారిగా వ్యవహరించారు. తుమ్మల బాబు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా కూటమి నాయకుల సమక్షంలో త్వరలో ప్రమాణ స్వీకార వేడుకను ఘనంగా నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ జీఎం ప్రవీణ్‌కుమార్, డీజీఎం శ్రీధర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



వెళ్లొస్తాం అంటూ.. తిరిగిరాని లోకాలకు!

వెళ్లొస్తాం.. అంటూ బయలుదేరారు.. కారులో బయలుదేరిన కుమారుడు, కుమార్తె.. మనవరాలిని.. కుటుంబీకులు సాగనంపి ఇంకా ఇంటి లోపలకు కూడా వెళ్లలేదు.. ఆ మాటలు ఇంకా చెవిలో వినపడుతూనే ఉన్నాయి.. అంతలోనే ఒక విషాదకర వార్త వారి చెవిన పడింది.. కారు చెట్టును ఢీకొనడంతో కుమారుడు, మనవరాలు మృతి చెందారన్న వార్తతో అక్కడే కూలబడి పోయారు..

7


సత్యదేవా నర్సరీలో యోగాంధ్ర ఏర్పాట్లపై చర్చిస్తున్న జేసీ చినరాముడు, ఆర్డీవో

నేడు సత్యదేవా నర్సరీలో యోగాంధ్ర

కడియం, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : కడియం సత్యదేవా నర్సరీలో శనివారం ఉదయం 6 గంటల నుంచి యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తామని జేసీ చినరాముడు తెలిపారు. జేసీ చినరాముడు, ఆర్డీవో కృష్ణనాయక్ శుక్రవారం నర్సరీ పరిశీలించారు.నర్సరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయాలని పుల్లా చంటియ్యకు సూచించారు.అధిక సంఖ్యలో జనం యోగాకు హాజరయ్యేలా చూడాలన్నారు.యోగా ఆరోగ్యానికి మంచిదన్నారు. వారి వెంట ఏపీఎంఐపీ పీడీ దుర్గేష్, డీటీవో వెంకటాచలం,జిల్లా ఉద్యాన అధికారి సుజాత, తహశీల్దార్ సునీల్‌కుమార్, నర్సరీసంఘం అధ్యక్షుడు రత్నం అయ్యప్ప, నర్సరీ అధినేత పుల్లా పెదసత్యనారాయణ, ఎంపీడీవో కె.రమేష్, ఉద్యాన అధికారి సుధీర్‌కుమార్, నర్సరీ సంఘం డైరెక్టర్‌లు తదితరులు ఉన్నారు.



ఆస్తుల.. పరినక్షణ!

కేంద్రం పట్టణ ప్రాంతాల్లో ఒక సర్వే చేస్తోంది.. ఈ సర్వే ఎంతో లాభదాయకం. యాజమాన్య వివాదాలు, దీర్ఘకాలికంగా చట్టపరమైన కేసులు పరిష్కరించుకునే అవకాశం ఉంటుంది. రోడ్లు, మురుగు కాలువలు, ఇతరత్రా మౌలిక సదుపాయాల కల్పన, ప్రాజెక్టుల అమలుకు అడ్డంకులు ఉండవు. ఆస్తులు, భూరికార్డులు పారదర్శకంగా డిజిటలైజ్డ్ విధానంలో అందుబాటులో ఉంచుతారు. నగరపాలక సంస్థ, కేంద్ర, ప్రభుత్వాల ఆస్తుల గుర్తింపునకు అవకాశం ఉంటుంది.



- దేశవ్యాప్తంగా 'నక్ష' సర్వే
- భూ వివాదాల పరిష్కారమే లక్ష్యం
- రాష్ట్రంలో 10 పట్టణాల్లో అమలు
- పైలెట్ ప్రాజెక్టుకు కాకినాడ ఎంపిక
- స్థలాలకు ఖచ్చితమైన రికార్డులు
- డిజిటలైజేషన్ చేసేలా ఏర్పాట్లు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)
నగరాలు, పట్టణాల్లో భూములు, స్థలాలపై కచ్చితమైన రికార్డుల తయారీ, ఉన్న రికార్డుల నవీకరణ ద్వారా వివాదాలకు పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో కేంద్రం అడుగులు వేస్తోంది. ఈ మేరకు జాతీయ జియో స్పేషియల్ పరిజ్ఞానం ఆధారంగా పట్టణ ఆవాసాల్లో భూ సర్వే (నక్ష) పేరుతో ఈ ఏడాది సర్వే చేపట్టింది. పైలెట్ ప్రాజెక్టు అమలుకు దేశవ్యాప్తంగా 152 పట్టణ స్థానిక సంస్థలను ఎంపిక చేసి రూ.194 కోట్లు కేటాయించింది. మన రాష్ట్రంలో పది పుర, నగరపాలక సంస్థలను కేంద్రం ప్రయోగాత్మకంగా ఎంపిక చేసింది. వాటిలో ఒంగోలు, అనంతపురం,గుంటూరు,నెల్లూరు, కర్నూలు, ఏలూరు, తిరుపతి, మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థలతో పాటు మన జిల్లాలోని కాకినాడ నగరపాలక సంస్థను తొలివిడతగా కేంద్రం ఎంపిక చేసింది. వీటిలో 524 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని ఏరియల్ సర్వే చేసి 9.50 లక్షల ఆస్తులను మ్యాపింగ్ చేసి డిజిటలైజ్ చేయనున్నారు. 2026 మార్చి నెలాఖరులోపు ఈ ప్రాజెక్టు పూర్తి చేసి ప్రజలకు కార్డులు అందజేయనున్నారు. రెండో దశలో మరికొన్ని పట్టణాలు ఎంపికయ్యే అవకాశాలు ఉన్నాయి.

కాకినాడలో ముందస్తు సర్వే...

కాకినాడ నగరంలో ప్రస్తుతం ముందస్తు ఏరియల్ సర్వే నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. సర్వే ఆఫ్ ఇండియా డిపార్ట్‌మెంట్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ అనే ఓ ప్రైవేటు సంస్థ ఈ సర్వే చేపట్టనుంది. డ్రోన్స్ ఎగరవేత, జీపీఎస్ కోఆర్డినేషన్‌కు సెంట్రల్ పాయింట్లు మార్కింగ్ చేసుకున్నారు. కాకినాడలో 32 కిలోమీటర్ల మేర 20 మార్కింగ్ పాయింట్లు వేశారు. ఈ ప్రాంతాల నుంచే డ్రోన్లు ఎగరవేసి బౌండరీల ఛాయాచిత్రాలను తీసుకుంటారు.

మూడు విడతల్లో సర్వే


ఈ సర్వే మూడు విడతల్లో చేపడతారు. ప్రస్తుతం ఆ సర్వేకు సంబంధించిన శిక్షణ కార్యక్రమం మైసూరులో జరుగుతోంది. రాష్ట్రంలోని ఎంపిక చేసిన పది నగరపాలక సంస్థ డిప్యూటీ సిటీ ప్లానర్లకు వారం రోజులపాటు శిక్షణ అందిస్తున్నారు. ఈ నక్ష సర్వే మూడు దశల్లో ముగిసాక డిజిటలైజ్డ్ కార్డుతో కూడిన ఆస్తి ధ్రువపత్రం అందజేస్తారు. ఏ విధమైన సమస్య లు లేనివాటిని తొలుత సర్వే చేస్తారు. ప్రజలు తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లు, కచ్చితమైన వివరాలు అందించాలి. - కృష్ణారావు, డీసీపీ, కాకినాడ


పురుషోత్తపల్లిలో మూసిన బంక్..
రోడ్డు వైపున పీకేసిన బోర్డు

బోర్డు పీకేసి..బంకుకు తాళాలు

- ఆంధ్రజ్యోతి కథనంతో మూసివేత
- డీజిల్ అక్రమార్కులు పరార్
- అసలు కన్నెత్తి చూడని అధికారులు

నిడదవోలు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : డీజిల్ మాఫియా ఉలిక్కిపడింది. 'ఆంధ్రజ్యోతి' కథనంతో రహస్య స్థావరాల్లో దాక్కున్నారు. అయితే అధికారుల్లో మాత్రం చలనం లేదు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతూ అక్రమ మార్గాల్లో డీజిల్ విక్రయిస్తున్న మాఫియాపై ఆంధ్రజ్యోతిలో శుక్రవారం కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లాలోని ధవళేశ్వరం, పంగిడి, దేవరపల్లి తదితర ప్రాంతాల్లో డీజిల్ మాఫియాలో వణుకు పుట్టింది. నిడదవోలు మండలం పురుషోత్తపల్లిలో బయో డీజిల్ పేరుతో వెలిసిన బంకుకు తాళాలు వేసి వాహనాలు లోపలికి రాకుండా అడ్డంగా తాళ్ళను సైతం కట్టేశారు. ఈ బంకు ఆవరణలో ఉండే ఆయిల్ డిస్పెన్సర్స్ (ఆయిల్ పంపు)నకు బరకాలు కప్పేశారు. పక్కనే ఉన్న డీజిల్ బంకు బోర్డును పీకేశారు. శుక్రవారం ఉదయం నుంచి బంకును మూసివేసి ఉంచారు. ఇంత జరుగుతున్నా మామూళ్ల మత్తో ఏమిటో కానీ అధికారులు స్పందించకపోవడం గమనార్హం. మామూళ్ల మత్తులో ఉన్నారో ఏమో కానీ.. అటు హెచ్‌పీ సంస్థ బృందం కానీ.. ఇటు జిల్లా అధికార యంత్రాంగం కానీ బంక వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో రకరకాల వాదనలు వినిపిస్తున్నాయి.పురుషోత్తపల్లి బంకులో డీజిల్ మాఫియాపై శనివారం అధికారులేం చర్యలు తీసుకుంటారో చూడాల్సిందే మరి.


మారనుంది చూడు : పుష్కరఘాట్, హేవలాక్ బ్రిడ్జి డిజైన్

అఖండ గోదావరి ప్రాజెక్టుకు 19న శంకుస్థాపన

రాజమహేంద్రవరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకు ఈ నెల 19న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి శంకుస్థాపన చేస్తారని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.రాజమహేంద్రవరం, ధవళేశ్వరం, కడియం, కొవ్వూరు, నిడదవోలు ప్రాంతాల్లో రూ.97 కోట్లతో పర్యాటక అభివృద్ధి చేస్తారన్నారు. హేవలాక్ బ్రిడ్జి ఆధునీకరణ, పుష్కరఘాట్ ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దుతామన్నారు. కడియం నర్సరీని పర్యాటకంగా తీర్చిదిద్ది..కాలువలో బోట్‌షికార్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.నిడదవోలు కోటసత్తెమ్మ దేవాలయాన్ని తీర్చిదిద్దనున్నామన్నారు. పుష్కరఘాట్‌కు టెండర్లు పిలిచారు.



కుక్కేసి.. తరలించేసి!

కొవ్వూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : పశువులను ట్రక్‌లో క్రూరంగా తరలిస్తున్న ఇద్దరిపై కేసునమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ వెంకట్రాదిపాలెంకు చెందిన డ్రైవర్ తాండ్ర నరేష్, అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం లక్ష్మీపాలెంకు చెందిన లారీ క్లీనర్ పసాదుల దుర్గాప్రసాద్ 16 ఆవులు, 18 దూడలు, 4 ఎద్దులు 38 పశువులను ట్రక్‌లో క్రూరంగా తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం వచ్చింది. ఈ మేరకు శుక్రవారం ఉదయం సీఐ విశ్వం సిబ్బందితో కొవ్వూరు గామన్‌బ్రిడ్జి వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. బొబ్బిలి నుంచి హైదరాబాద్‌కు నంబరు ప్లేట్ లేని ట్రక్‌లో తరలిస్తున్న పశువులు, ట్రక్ స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్, క్లీనర్లపై కేసునమోదు చేసినట్టు తెలిపారు.



సీజన్లో ఒక్కసారైనా తినాలనిపించే...
సీమ చింతకాయలు



సామర్లకోట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సీమ చింతకాయలు... ఇవి వైశాఖ మాసం నుంచి జ్యేష్ఠ మాసం వరకు విరివిగా లభిస్తాయి. వీటిని చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అమితంగా ఇష్టపడుతుంటారు. వేసవిలో సెలవుల్లో పల్లెల్లో పొలాలు, పుంతలు, కాల్వ గట్లపై ఉన్న చెట్ల నుంచి సీమ చింతకాయలను చిన్నారులు సేకరిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లోనే లభించే ఇవి ప్రస్తుతం నగరాలు, పట్టణాల్లోనూ కనిపిస్తున్నాయి. వ్యాపారులు కిలో రూ.100 నుంచి రూ.120కి విక్రయిస్తున్నారు. ఈ రెండు నెలలు కూడా పలువురికి జీవనోపాధిగా ఉంటోంది. కొంతమంది మహిళలు గంపలతో ఇంటింటికీ తిరుగుతూ, ఇంకొంతమంది తోపుడుబండ్లపైన, మోటారు సైకిళ్లపైన రహదారుల వెంబడి విక్రయాలు సాగిస్తున్నారు. వీటిని తినడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆయుర్వేద వైద్య నిపుణులు చెప్తున్నారు. గర్భిణులు తింటే గర్భ విచ్ఛిత్తి జరిగే ప్రమాదముందని మరికొందరు వైద్యులు వివరిస్తున్నారు.

ఆరోగ్య ప్రయోజనాలెన్నో
డాక్టర్ ప్రవీణ

మధుమేహ వ్యాధిని నియంత్రణలో ఉంచడానికి సీమచింతకాయలు దోహదపడతాయి. విటమిన్-సి, శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు అధిక మొత్తంలో ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. శరీరంలోని పలు వైరస్‌లు, బ్యాక్టీరియాలతో సమర్థవంతంగా పోరాడి రోగాల బారినపడకుండా కాపాడుతుంది. గుండెకు ఎంతో మేలుచేస్తుంది. రక్తంలోని కొలెస్ట్రాల్ స్థాయిని నియంత్రిస్తుంది. క్యాన్సర్‌తో పోరాడే గుణాలు పుష్కలంగా ఉంటాయి.

మూడు గంటల్లో 25 వేలమందికి భోజనాలు



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ షాన్‌మోహన్

అక్షయపాత్ర ఫౌండేషన్ వంటశాలకు భూమి పూజ

కాకినాడ రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రోజుకు మూడు గంటల్లో 25వేల మందికి భోజనాలు తయారు చేసేందుకు వీలుగా అక్షయ పాత్ర ఫౌండేషన్ కేంద్రీకృత వంటశాల నిర్మాణం చేపట్టనుందని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అన్నారు. కాకినాడ రూరల్ మండలం వాకలపూడి వరలక్ష్మీనగర్‌లో అక్షయ పాత్ర ఫౌండేషన్ రెండో దశ కేంద్రీకృత వంటశాల నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. కలెక్టర్ షాన్‌మోహన్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, అక్షయపాత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు, హరేకృష్ణ మూమెంట్ ఆఫ్ ఇండియా సత్యగౌరచంద్రదాస, ఓఎన్జీసీ సీజీఎం ప్రభాల్ సేన్‌గుప్తా, ఈడీ, సర్వేస్ మేనేజరు రజత్‌మల్హోత్రా, సంజయ్‌లాల్, ఓఎన్జీసీ సీజీఎం (ఢిల్లీ) పీవీవీ సత్యనారాయణమూర్తి శంకుస్థాపన చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారాన్ని సమర్థవంతంగా అందించేందుకు రూ.18.2 కోట్ల సీఎస్సార్ నిధులతో రెండో దశ వంటశాల నిర్మాణం చేపట్టామన్నారు. ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో కాకినాడ రూరల్ ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి, అక్షయపాత్ర ఫౌండేషన్‌కు చెందిన వివిధ జిల్లాల స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఎన్ఆర్ఐ ఆర్థిక సాయం

బాధిత కుటుంబాన్ని దత్తత తీసుకుంటానని ఎంపీడీవోకు దరఖాస్తు



ఎంపీడీవోకు అందజేసిన దరఖాస్తును చూపిస్తున్న అచలచౌదరి

రాయవరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం చెల్లూరు గ్రామంలో పేద కుటుంబానికి అదే గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన వైట్ల కృష్ణారావు మనువరాలు బలుసు అచలచౌదరి జర్మనీలో ఉద్యోగం చేస్తున్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన పీ4(పబ్లిక్ పీపుల్ ప్రైవేట్ పాట్నర్‌షిప్) పథకానికి అచలచౌదరి ఆకర్షితురాలయ్యారు. గ్రామంలో ఉన్న కట్టుంగ రాజశేఖర్ దీర్ఘకాలిక రోగంతో మంచం పట్టడంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంది. దీంతో బాధిత కుటుంబాన్ని దత్తత తీసుకుంటానని, అందుకు తగ్గ అనుమతులు అందజేయాలని కోరుతూ ఎంపీడీవో కీర్తిస్పందనకు అచల చౌదరి శుక్రవారం దరఖాస్తు అందజేశారు. దాత ఔదార్యాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో అచల చౌదరి తాత వెట్ల కృష్ణారావు, దేవ్ శ్రీను, టీడీపీ నాయకుడు ఉండవల్లి రాంబాబు పాల్గొన్నారు.

వాడపల్లి వేంకటేశ్వరస్వామికి అష్టోత్తర పూజలు



వాడపల్లిలో పల్లకి మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన వారు అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,83,792 లభించినట్టు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. అలాగే వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి భీమవరానికి చెందిన సీవీ చంటి-శాంతి దంపతులు రూ.1,16,000 విరాళం సమర్పించారు. దాతలకు స్వామి వారి చిత్రపటం అందజేశారు.

తిరునక్షత్ర ఉత్సవాలు.. వాడపల్లి వెంకన్న ఆలయంలో తిరునక్షత్ర ఉత్సవాలు రెండో రోజు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ద్రవిడ వేద పారాయణం, సాయంత్రం స్వామి వారి పల్లకి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉపకమిషనరు ఏర్పాట్లు నిర్వహించారు.

మరిడమ్మకు స్వర్ణ పుష్పార్చన



పెద్దాపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలోని మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో వేదపండితుల మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు జరిపారు. దేవస్థానం సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి, ఆలయ సిబ్బంది రమణ, వేదపండితులు, ఆసాదులు, భక్తులు పాల్గొన్నారు.

> ఆటిజంతో బాధపడే విద్యార్థులకు అండగా నిలవడంతో పాటు అటువంటి వారిని గుర్తించి సరైన శిక్షణ ఇచ్చేందుకు ఆటిజం సెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా తొలి దశలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 14 పాఠశాలల్లో ఆటిజం కేంద్రాల ఏర్పాటుకు అనుమతి మంజూరు చేసింది. ఒక్కో కేంద్రానికి రూ27.25 లక్షలు చొప్పున నిధులు కేటాయించారు. ఈ కేంద్రాల ద్వారా ఆటిజం బాధిత విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు నిరంతరం శిక్షణ ఇస్తారు. ఆటిజం లక్షణాలతో బాధపడుతున్న వారిని తొలి దశలో గుర్తించి వారికి అవగాహన కలిగించే కేంద్రాలుగా ఇవి పని చేయనున్నాయి.



ఆటిజం బాధిత విద్యార్థులకు అండగా

- తొలి దశలో ఉమ్మడి జిల్లాలోని పాఠశాలల్లో 14 కేంద్రాలు ఏర్పాటు
- ఒక్కో కేంద్రం ఏర్పాటుకు రూ.27.25 లక్షలు చొప్పున నిధుల మంజూరు
- ఆటిజం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు శిక్షణ
- చిన్నారులకు నిరంతరం పరీక్షలు

(పిఠాపురం/గొల్లప్రోలు రూరల్-ఆంధ్రజ్యోతి)

ఆటిజం అనేది నాడీ సంబంధిత రుగ్మత. ఇది సామాజిక కమ్యూనికేషన్, ప్రవర్తనల్లో తేడాలను కలిగిస్తుంది. ఆటిజం ఉన్న చిన్నారులు, వ్యక్తులు ఇతరులు చెప్పే విషయాలను అర్థం చేసుకోవడంలోను, చెప్పదలచుకున్న విషయాలను కమ్యూనికేట్ చేయడంలోను ఇబ్బందులు ఎదుర్కొంటారు. వీరు పైకి సాధారణ పిల్లలు, వ్యక్తులుగా కనిపించినప్పటికీ వారికి చెప్పిన అంశాలను అర్థం చేసుకోవడానికి సమయం తీసుకుంటారు. తమ భావనలను వ్యక్తీకరించడంలో ఇబ్బందిపడతారు. ఇటువంటి లక్షణాలతో ఉన్నవారిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే సాధారణ శిక్షణ ద్వారా అందరి పిల్లలు, వ్యక్తులగానే తీర్చిదిద్దే అవకాశం ఉంటుంది. ఇటీవలి కాలంలో ఆటిజం లక్షణాలతో ఉన్న విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. వీరికి శిక్షణ ఇచ్చి సాధారణ విద్యార్థులు మాదిరిగానే అన్ని అంశాలనూ అర్థం చేసుకునే రీతిలో శిక్షణ, చికిత్స అందజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి.



ఆటిజం సెంటరు ఏర్పాటుచేసే గొల్లప్రోలు మండలం చేబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 14 పాఠశాలల్లో ఆటిజం సెంటర్ల ఏర్పాటుకు అనుమతి ఇస్తూ సమగ్ర శిక్షా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. కాకినాడ జిల్లాలోని గొల్లప్రోలు మండలం చేబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పిఠాపురం మండలం నరసింగపురంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, సామర్లకోట మండలం ఉండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెద్దాపురం మండలం కాండ్రకోట జడ్పీహెచ్ఎస్, పెద్దాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సామర్లకోట అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల, కాకినాడ గాంధీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ఇందుకు రూ.1.94 కోట్లు మంజూరు చేశారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ముమ్మిడివరం మండలం అనాతవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మండపేట పట్టణంలోని అంకసాని చెరువు, అమలాపురం వెచ్చావారి అగ్రహారం, రామచంద్రపురం చాకలిపేట మునిసిపల్ ఉన్నత పాఠశాలల్లో కేంద్రాల ఏర్పాటుకు రూ.1.11 కోట్లు మంజూరు చేశారు.

తూర్పు గోదావరి జిల్లాలోని కొవ్వూరు మండలం ఇసుకపట్ల, పంగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాజమహేంద్రవరం ఇన్నీస్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నిడదవోలు మండలం సమిశ్రగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కేంద్రాల ఏర్పాటుకు రూ.83.25 లక్షలు మంజూరయ్యాయి.

లక్ష్యాలు ఇవీ...

ఆటిజంతో బాధపడే విద్యార్థుల గుర్తింపునకు స్క్రీనింగ్, వారి పరిస్థితి అంచనా, శిక్షణ, వారికి సాధారణ విద్యార్థులతో సమానంగా విద్యా బోధన తదితర అంశాలు లక్ష్యంగా ఆటిజం సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆటిజంతో బాధపడే విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు శిక్షణ ఇచ్చి ఉపాధ్యాయులు చెప్పే విషయాలను అర్థం చేసుకొనేలా తీర్చిదిద్దనున్నారు. ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్, ఇంటెలెక్చువల్ డిజేబుల్టీ, స్పెసిఫిక్ లెర్నింగ్ డిజేబుల్టీపై అవగాహన కల్పించే హబ్‌లుగా ఈ కేంద్రాలు వ్యవహరించనున్నాయి. చిన్నారులకు నిరంతరాయంగా స్క్రీనింగ్ నిర్వహించి ఇటువంటి లక్షణాలతో బాధపడుతున్న వారిని ప్రాథమిక దశలోనే గుర్తించి తగు శిక్షణ, చికిత్స అందించనున్నారు. ఆటిజంతో బాధపడే విద్యార్థుల్లో అంతర్లీనంగా పలు అంశాల్లో ప్రతిభ చూపడాన్ని గుర్తించి వారిని అందులో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఆటిజం సెంటర్ల ఏర్పాటు, టీచింగ్ అండ్ లెర్నింగ్ మెటీరియల్ తయారీ, ఈ కేంద్రాల్లో నియమించాల్సిన సిబ్బంది, ఉపాధ్యాయులు తదితర అంశాలను గుర్తించేందుకు సమగ్ర శిక్షాలో రాష్ట్ర స్థాయిలో ఒక అధికారిని ప్రత్యేకంగా నియమించారు.

పీఎంశ్రీ ద్వారా మంజూరు

కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖ అమలు చేస్తున్న పీఎంశ్రీ స్కూల్స్ కాంపోనెంట్ ప్రాజెక్టు ఇన్నోవేషన్ ప్రోగ్రాం ద్వారా ఆటిజం బాధిత విద్యార్థులకు ప్రత్యేకంగా కేంద్రాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. రాష్ట్రంలోని ప్రతి మునిసిపాలిటీ లేదా పట్టణాలకు దగ్గరగా ఉండి, ఆటిజం విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో 125 కేంద్రాలను తొలి దశలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇదే విషయాన్ని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించి... ఈ విద్యా సంవత్సరం నుంచే అందుబాటులోకి తీసుకొస్తామని అసెంబ్లీలో వెల్లడించారు. దీనికి అనుగుణంగా కేంద్రంతో సంప్రదింపులు జరపడంతో 125 ఆటిజం సెంటర్ల ఏర్పాటుకు అంగీకారం తెలిపింది. ఈ కేంద్రాలు ఏర్పాటుచేసే చోట ఒక యూరినల్, ఒక డిజేబుల్డ్ ఫ్రెండ్లీ టాయిలెట్ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు.

ఇప్పటికే ఉన్న భవిత, నాన్ భవిత కేంద్రాల ద్వారా వీరికి శిక్షణ అందుతున్నప్పటికీ ఆటిజం బాధిత విద్యార్థుల కోసం ప్రత్యేక కేంద్రాల ఏర్పాటుతో వారిపై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించడానికి వీలవుతుంది. తొలి దశలో మంజూరైన ఆటిజం సెంటర్లను రెండు విడతల్లో ఏర్పాటుచేసి వాటి ద్వారా వచ్చే ఫలితాల ఆధారంగా మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

9న స్టార్టప్ సమ్మిట్ 2025పై అవగాహన సదస్సు
మంత్రి సుభాష్



రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఇంట్లో పారిశ్రామిక వేత్తను సృష్టించే లక్ష్యంతో ఈనెల 9న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో సీడాప్ ఆధ్వర్యంలో కోనసీమ స్టార్టప్ సమ్మిట్-2025 పేరిట ఎంఎస్ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి సుభాష్ తెలిపారు. కోనసీమ జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి కీలకశాఖల భాగస్వామ్యంతో నైపుణ్యాభివృద్ధి శిక్షణ, నిపుణులతో సందేహాల నివృత్తి అనంతమైన అవకాశాల కల్పన ద్వారా నిరుద్యోగ యువతీయువకులకు ఉపాధి శిక్షణ అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌తోపాటు ఎంపీ హరీష్, సీడాప్ చైర్మన్ దీపక్‌రెడ్డి, ఎంఎస్ఎంఈ చైర్మన్ శివశంకర్, జిల్లాలో ప్రజాప్రతినిధులు, యువ పారిశ్రామికవేత్తలు, అన్ని శాఖల అధికారులు, బ్యాంకింగ్ అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు.

అపర్ణాదేవికి మామిడిపండ్లతో అలంకారం



గొల్లప్రోలు రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో అపర్ణాదేవిని మామిడిపండ్లతో అలంకరించారు. జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం మామిడిపండ్లు, పుష్పాలతో అలంకారం చేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఆకొండి ప్రభాకరశాస్త్రి పూజలు చేయగా వేద పండితుడు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ఆలయ కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఉత్పత్తులు పెంచడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న శేషుమాధవ్

- ఐసీఏఆర్ డైరెక్టర్ శేషుమాధవ్
- రైతులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కార్యక్రమం

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) ఆధ్వర్యంలో వ్యవసాయ ఉత్పత్తులు పెంచాలనే ఉద్దేశ్యంతో పెత్తఎత్తున ప్రీ ఖరీఫ్ ప్రచారాన్ని మే 29 నుంచి జూన్ 12 వరకు వికసిత్ క్రిషి సంకల్ప్ అభియాన్ (వీకేఎస్ఏ) కార్యక్రమం చేపడుతోందని సంస్థ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ తెలిపారు. ఈ మేరకు ఐసీఏఆర్ సమావేశ మందిరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని ఐసీఏఆర్ సంస్థలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కేవీకేలు, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ విభాగాలు పాల్గొంటున్నాయన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 2వేలకు పైగా జట్లుగా ఏర్పడి ప్రతిరోజూ 700 జిల్లాలు 6500 గ్రామాలను సందర్శిస్తూ 1.5కోట్ల రైతులను కలిసి రాబోయే ఖరీఫ్ సీజనులో రైతుల ఆదాయాన్ని పెంచడానికి, స్థిరమైన వ్యవసాయం చేయడానికి కావలసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నాయన్నారు. దీనిలో భాగంగా రాజయహేంద్రవరంలోని ఎన్ఐఆర్‌సీఏ 29 శాస్త్రవేత్తలను ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, వెస్ట్‌బెంగాల్ రాష్ట్రాలలోని 16 కేవీకేలతో కలిసి 29 జట్లుగా ఏర్పడి మే 29 నుంచి విరివిగా రైతులతో మమేకమై చర్చిస్తున్నామన్నారు. ఎనిమిది రోజులుగా ఎన్ఐఆర్‌సీఏ శాస్త్రవేత్తలు 228 గ్రామాలను సందర్శించి 47,230 మంది రైతులను, రైతు మహిళలను కలిసి వికసిత కృషి ఉద్దేశ్యాన్ని నెరవేర్చడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారని మాగంటి శేషుమాధవ్ అన్నారు. ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా నోడల్ సైంటిస్ట్ డాక్టర్ వై.సుబ్బయ్య వ్యవహరిస్తున్నారన్నారు.

నయనానందకరం బాలబాలాజీ కల్యాణం



అప్పనపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, బాలబాలాజీస్వామి

- గోవిందనామస్మరణలతో మార్మోగిన అప్పనపల్లి
- శ్రీనివాసుడి కల్యాణోత్సవాలు



మామిడికుదురు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లిలో వైనతేయ నదీ తీరంలో వేంచేసి ఉన్న, బాలతిరుపతిగా వర్థిల్లుతున్న అప్పనపల్లి బాలబాలాజీస్వామి కల్యాణం శుక్రవారం రాత్రి నయన మనోహరంగా జరిగింది. జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి శుభ ముహూర్తాన అర్చకులు స్వామివారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి తిరు కల్యాణోత్సవాలు సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు గొడవర్తి శ్రీనివాచార్యులు, చినజీయర్ స్వామి శిష్యబృందం, ఆలయ ముఖ్య ఉపార్చకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎదురుకోలు సన్నాహం కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం ప్రత్యేక పుష్పాలతో అలంకరించిన పెళ్లి పందిరిలో స్వామివారి కల్యాణాన్ని ఉభయ దేవేరులతో శాస్త్రోక్తంగా 9.15 గంటలకు కన్నుల పండుగగా నిర్వహించారు. కల్యాణోత్సవాలను ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీ మోహన్, గన్నవరం సీఐ ఆర్.భీమరాజు, నగరం ఏఎంసీ చైర్మన్ పెను మాల లక్ష్మీ, టీడీపీ, జనసేన, బీజేపీ మండలాధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజా, బైరిశెట్టి దుర్గా రామకృష్ణలతోపాటు అధిక సంఖ్యలో భక్తులు స్వామి కల్యాణాన్ని తిలకించి స్వామి వారిని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

గరుడ వాహన సేవ

అప్పనపల్లి బాలబాలాజీస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఉదయం పలు పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి సందర్భంగా స్వామివారికి ఆరాధన, సహస్ర నామార్చన, బాలభోగ నివేదన, నిత్యహోమం, బలిహరణ, చతుష్టానార్చనలు, ధ్వజావరోహణం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేశారు. అనంతరం స్వామివారిని గరుడ వాహనంపై కోలాటం, వివిధ రకాల డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. మన్యం బ్రదర్స్ ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. సాయంకాలం చతుష్టానార్చనలు, నిత్య ఉపాసన, బలిహరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాలు సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయార్చకుల పర్యవేక్షణలో జరిగాయి. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెంకు చెందిన కోలాట భజన సమాజంవారు నిర్వహించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది.



కల్యాణాన్ని తిలకిస్తున్న ప్రముఖులు



సాలీడ్‌గా..

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్- రాజమహేంద్రవరం

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఓ సాలీడు ఇలా గట్టిగా అల్లుకోగా ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించింది.

అమాయకులు, పేదలే టార్గెట్!

లోన్లు ఆశ చూపి డబ్బు లాగేస్తున్న ఇద్దరి అరెస్ట్

- రూ.కోట్లలో లావాదేవీలు
- రూ.18 లక్షలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్



స్వాధీనం చేసుకున్న అకౌంట్ పుస్తకాలు, ఏటీఎంలు, ఫోన్లు



కాకినాడలో అరెస్ట్ అయిన నిందితులను చూపుతున్న పోలీసులు



మాట్లాడుతున్న ఎస్పీ

కాకినాడ క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): అమాయకులు, పేద ప్రజలే వారి టార్గెట్. ఆధార్ కార్డు ద్వారా బ్యాంక్ ఖాతా తెరిచి సంబంధిత బ్యాంక్ పాస్‌బుక్, ఏటీఎం కార్డ్, సిమ్‌కార్డ్ ఒక కిట్‌గా మాకు ఇవ్వడం ద్వారా మీకు లోన్‌లు, నెలకు రూ.5వేలు ఇస్తామని ఆశ చూపుతూ నమ్మబలికి తద్వారా ఆ కిట్లను అమాయకుల వద్ద నుంచి తీసుకుని ఒకరి నుంచి మరొకరికి రూ.కోట్లలో లావాదేవీలు చేస్తున్న ముఠాను కాకినాడ జిల్లా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను శుక్రవారం అరెస్టు చేశారు. కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ జి.బిందుమాధవ్ వెల్లడించారు. ఇటీవల సైబర్ నేరాలు పెచ్చుమీరుతున్న నేపథ్యంలో ఎస్పీ ఆదేశాలతో జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో కాకినాడ సాంబమూర్తినగర్‌కు చెందిన కొర్రా లో వకృష్ణకు తన స్నేహితుల ద్వారా పరిచయమైన సామర్లకోట టిడ్కో అపార్ట్‌మెంట్స్‌కు చెందిన 37 ఏళ్ల నార్ని సతీష్‌చంద్ర అలియాస్ సతీష్ పరిచయమయ్యాడు. అనంతరం సతీష్ ద్వారా ఈ ఏడాది జనవరి 31న కాకినాడ వన్‌టౌన్ పరిధిలోని కర్ణాటక బ్యాంక్‌లో లోవకృష్ణతో అకౌంట్ ఓపెన్ చేయించి ఈ అకౌంట్ ద్వారా లోన్‌లు, ప్రతి నెల రూ.5 వేలు ఇప్పిస్తానని ప్రలోభపెట్టి లోవకృష్ణతో పాటు అతడి స్నేహితులతో కూడా అకౌంట్‌లు ఓపెన్ చేయించాడు. వారికి బ్యాంక్ అకౌంట్‌లపై పెద్దగా అవగాహన లేకపోవడం బ్యాంక్ పాస్‌బుక్, ఏటీఎం కార్డ్, సెల్‌సిమ్‌కార్డ్, చెక్‌బుక్ కలిపి ఒక కిట్‌గా భావించి తన స్నేహితులకు సతీష్‌కు ఇచ్చాడు. అయితే కొన్ని రోజుల తరువాత సతీష్‌ను ఎన్నిసార్లు అడిగినా లోన్‌లు రావడం లేదని లోవకృష్ణకు చెప్పాడు. అలాగే ప్రతి నెల ఇస్తానన్న రూ.5వేలు కూడా ఇవ్వక పోవడంతో సతీష్‌ను నిలదీయడంతో సరైన సమాధానం చెప్పకపోవడంతో లోవకృష్ణ కర్ణాటక బ్యాంక్‌కు వెళ్లి ఆరా తీశాడు. అయితే తన అకౌంట్ ద్వారా సుమారు రూ.50 లక్షల నగదు అక్రమ లావాదేవీలు జరిగినట్టు గుర్తించి వెంటనే కాకినాడ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుపై క్రైం నెం 140/2025 కేసు రిజిస్ట్రేషన్ అయిన వెంటనే ఎస్పీ సూచనలతో కాకినాడ ఎస్‌డీపీవో మనీష్‌దేవరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో కాకినాడ వన్‌టౌన్ లా అండ్ ఆర్డర్, కాకినాడ, పెద్దాపురం క్రైం పోలీసులను 3 ప్రత్యేక టీమ్‌లుగా ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు.

రూ.30 వేలకు కిట్ల అమ్మకాలు

అనంతరం సతీష్‌చంద్ర అలియాస్ సతీష్‌తో పాటు సామర్లకోటకు చెందిన 31 ఏళ్ల దాస రి వీర వెంకట సత్యనారాయణ ప్రసాద్‌ను అరెస్ట్ చేశారు. వారిద్దరూ కలిసి కాకినాడలో ఉండే ఉదయ్‌కిరణ్‌కు ఈ కిట్లను రూ.30 వేలకు అమ్ముతున్నారు. ఉదయ్‌కిరణ్ 30ఏళ్ల క్రితం సామర్లకోటలో ఉండి బెంగళూరు వెళ్లి అక్కడి నుంచి గోవాలో క్యాసినోలో పని చేసి.. తర్వాత దుబాయ్‌కి వెళ్లిపోయిన పుట్టా రామ్ అనే వ్యక్తికి ఈ బ్యాంక్ ఖాతాల కిట్లను అందజేస్తుండగా అక్కడ నుంచి రామ్ ఈ సైబర్ క్రైం దందా నడిపిస్తున్నాడు.

50 కిట్ల స్వాధీనం

ఈ విధంగా ప్రస్తుతానికి 50 మంది బ్యాంక్ ఖాతాల ద్వారా వచ్చిన 50 కిట్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ లావాదేవీలు కేవలం 2,3 నెలలో జరిగినవే. ఈ ఖాతాల ద్వారా రూ.8.80 కోట్ల లావాదేవీలు జరిగినట్టు గుర్తించారు. ఉదయ్‌కిరణ్‌ను, పుట్టా రామ్‌ను త్వరలోనే అరెస్ట్ చేస్తామని కాకినాడ ఎస్పీ వెల్లడించారు. కాగా బాధితులందరు ఉత్తరప్రదేశ్, వెస్ట్ బెంగాల్, గుజరాత్, కర్ణాటక తదితర రాష్ట్రాలకు చెందిన వారు. ప్రస్తుతానికి నిందితుల నుంచి రూ. రూ.18లక్షలు స్వాధీనం చేసుకున్నామని, బాధితులను గుర్తించి వారికి అందజేస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. అయితే నార్ని సతీష్ పాత నేరస్థుడని, అతడిపై పలు పోలీస్‌స్టేషన్‌లలో దొంగతనం కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, కాకినాడ ఎస్‌డీపీవో మనీష్‌దేవరాజ్ పాటిల్, ఎస్‌బీ డీఎస్పీ సీహెచ్ శ్రీరామకోటేశ్వరరావు, క్రైం సీఐ వి.కృష్ణ, వన్‌టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు పాల్గొన్నారు.

వెళ్లొస్తాం అంటూ.. తిరిగిరాని లోకాలకు!

- వేప చెట్టును కారు ఢీకొనడంతో ఇద్దరి మృతి
- మరో ఇద్దరికి గాయాలు
- పోతవరంలో విషాదఛాయలు



చెట్టును ఢీకొని నుజ్జు నుజ్జు అయిన కారు





మరణించిన మల్లేశ్, ఆర్షి (ఫైల్ ఫొటోలు)

నల్లజర్ల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పోతవరం- యర్నగూడెం రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పోతవరం గ్రామానికి చెందిన మల్లేశ్ (22) అతడి తల్లి రత్న కుమారి, చెల్లి అంకిత, మేనకోడలు ప్రియ ఆర్షి (3)తో కలిసి తన కారులో నిడదవోలు దగ్గర కలవచర్లకు ఓ వివాహ రిసెప్షన్‌కు వెళ్తుండగా పోతవరం- యర్నగూడెం గ్రామాల మధ్య రహదారి పక్కనే ఉన్న వేప చెట్టును కారు ఢీకొంది. మల్లేశ్ అక్కడికక్కడే మృతిచెందగా ఆర్షి, రత్నకుమారి, అంకితకు గాయాలు కాగా ఏలూరు ఆసుపత్రికి తరలించారు. ఆర్షి చికిత్స పొందుతూ మృతిచెందింది. వారు ఇంటి నుంచి బయలుదేరిన 5 నిమిషాల్లో ప్రమాదం జరిగింది. 5 నిమిషాల క్రితం బయలుదేరిన వారు మృత్యువాడ పడడంతో కుటుంబ సభ్యులు తీవ్రంగా రోదించడంతో స్థానికులు కంటతడి పెట్టారు. మల్లేశ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ జాతర కోసం పోతవరం వచ్చి కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతున్నాడు. ఇలాంటి తరుణంలో దుర్ఘటన జరగడంతో పోతవరంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గొంతు కోసి.. బండరాయితో మోది..

కోరుకొండ మండలం నిడిగట్ల- గాడాల సరిహద్దులో యువకుడి హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కోరుకొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం నిడిగట్ల- గాడాల సరిహద్దులో యువకుడి హత్య జరిగినట్టు పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం.. ఈ నెల 4వ తేదీ రాత్రి రాజమహేంద్రవరం రూరల్ మండలం వెంకటనగరం గ్రామానికి చెందిన కొవ్వాడ అబ్బులు(30), రాజమహేంద్రవరంలోని ఆర్యాపురానికి చెందిన వీరబాబు, దుర్గాసాయి, ఆకుల గణేష్ పార్టీ చేసుకున్నారు. రాజమహేంద్రవరం రివర్‌బేలో స్నానం కూడా చేశారు. అక్కడ వీరబాబు సెల్‌ఫోన్ కింద పడి పగిలిపోయింది. దీంతో నలుగురి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం రాత్రి మద్యం తాగారు. తదుపరి తోపులాట జరిగింది. అనంతరం గొడవ సద్దుమణిగి ఎవరి ఇంటికి వారు వెళ్లిపోతుండగా అబ్బులు.. వీరబాబు బండి ఆపి వార్నింగ్ ఇచ్చాడు. దీంతో అందరం కలిసి మాట్లాడుకుందామని కోరుకొండ మండలం నిడిగట్ల- గాడాల సరిహద్దు ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడకు వెళ్లిన అబ్బులు గొంతు కోసి ఆపై తలపై బండరాయితో మోదడంతో అబ్బులు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ హత్య కేసులో వీరబాబు, దుర్గాసాయి, ఆకుల గణేష్, తరుణ్, శ్రీనివాస్‌రెడ్డిని నిందితులుగా భావిస్తున్నారు. క్లూస్ టీం సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించింది. అలాగే అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆ ర్డర్) సుబ్బరాజు, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, నార్త్ జోన్ డీఎస్పీ శ్రీకాంత్, సీఐ సత్యకిషోర్, ఎస్ ఐ నాగరాజు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రంగా విగ్రహ వివాదానికి పరిష్కారం

ఇరు వర్గీయులతో అధికారుల చర్చలు

అంతర్వేది, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామంలో వంగవీటిరంగా విగ్రహం విషయంలో ఇటీవల వివాదం జరిగింది. దీంతో డీఎస్పీ, ఎమ్మెల్యే, ఆర్డీవో, నాయకులు ఇరు వర్గీయులతో అప్పుడు చర్చించారు. శుక్రవారం ఇరు వర్గీయులను కూర్చోబెట్టి ఆర్డీవో మాధవి, సీఐ నరేష్‌లు వివాదానికి పరిష్కారం చూపారు. విగ్రహం పొడవు, వెడల్పులు అనుకూలంగా మార్చి ఏర్పాటు చేసుకోమని సూచించారు. దీంతో రంగా విగ్రహ వివాదం సద్దుమణిగింది. కార్యక్రమంలో ఎస్ఐ దుర్గాశ్రీనివాస్, వీఆర్వోసుధాకర్, స్థానిక నాయకులు ఉన్నారు.



అంతర్వేదిలో ఇరు వర్గీయులతో మాట్లాడుతున్న ఆర్డీవో మాధవి, సీఐ నరేష్

సామర్లకోటలో పిచ్చి కుక్క దాడి

ఆరుగురికి గాయాలు

సామర్లకోట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట వీర్రాఘవపురంలో గురువారం రాత్రి పిచ్చి కుక్క దారిన వెళ్తున్న ఆరుగురు వ్యక్తులను కరిచింది. దీంతో బాధితులను స్థానికులు హుటాహుటిన సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. ఉన్నత చికిత్స కోసం నలుగురిని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో పిచ్చి కుక్క స్వైరవిహారం చేస్తున్నట్టు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎటువంటి ఫలితం లేకపోయిందని పలువురు వాపోయారు. కాగా సామర్లకోట పట్టణ పరిధిలో పలు వార్డుల్లో ఎక్కువ మంది కుక్క కాట్లకు గురవుతున్నారని ఆసుపత్రిలో ఉన్న వ్యాక్సిన్ నిల్వలు అయిపోవడంతో వ్యాక్సిన్ అందుబాటులో ఉండడంలేదని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగతనం చేసిన ఇద్దరి అరెస్టు

కొవ్వూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఇంటి తలుపులు పగలగొట్టి సెల్‌ఫోన్ దొంగతనం చేసిన ఇద్దరి వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. ఈ నెల 5వ తేదీన రాత్రి తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు యువరాజ్ కేబుల్ వీధిలో నివాసం ఉంటున్న గవర దుర్గాసాయి ఇంటికి తాళం పెట్టి కొవ్వూరు గోష్పాదక్షేత్రం గోదావరినదిలో స్నానం చేసి వచ్చేలోగా ఇంటిలో చార్జింగ్ పెట్టిన సెల్ ఫోను దొంగిలించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దొంగతనానికి పాల్పడిన కొవ్వూరు పట్టణానికి చెందిన మోడీ వెంకటస్వామి, ప్రకాశం జిల్లా దర్శికి చెందిన పులిమి బసవయ్యను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్టు సీఐ పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కాకినాడ రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ-సామర్లకోట ప్రధాన కాలువలో కాకినాడ రూరల్ మండలం గంగనాపల్లి పరిధిలోని కోటిపల్లి రైల్వే వంతెన పక్కన సుమారు 50 ఏళ్ల వయసు కలిగిన మృతదేహాన్ని శుక్రవారం మధ్యాహ్నం గుర్తించినట్టు ఇంద్రపాలెం ఎస్ఐ వీరబాబు తెలిపారు. మృతదేహం సమారు 20 రోజులుగా నీటిలో మునిగిపోయినట్టు ఉండి శరీరం మొత్తం ఉబ్బి, చర్మం ఊడిపోయి గుర్తించడానికి వీలుగా లేని స్థితిలో ఉంది. మృతుడి శరీరంపై పింక్ కలర్ పొడవు చేతుల చొక్కా, నడుముకి నలుపు రంగు మొలతాడు ఉన్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సంబంధిత వ్యక్తులు ఎవరైనా ఉంటే ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్ 94407 96555లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

తిరుమాలిలో ఎడ్ల పరుగు పోటీలు



పోటీల్లో పరుగులు తీస్తున్న ఎడ్లు



విజేతలకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం తిరుమాలి గ్రామంలో నేరేళ్లమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు ఉత్సాహంగా సాగాయి. 50 జతలు పాల్గొన్నాయి. వీటిలో సీనియర్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో అంబేడ్కర్ కోనసీమ జిల్లా గుమ్మిలేరు గ్రామానికి చెందిన కోరా వీరవెంకట సత్యవేణి ఎడ్లు, కాకినాడ జిల్లా కొవ్వాడ గ్రామానికి చెందిన మట్టా నవనీత్ మణికంఠ ఎడ్లు, తూర్పు గోదావరి జిల్లా కాపవరం గ్రామానికి చెందిన కుంచం మనోజ్ రామలింగేశ్వర ఎడ్లు నిలిచాయి. జూనియర్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో కాకినాడ జిల్లా చేయివాడ గ్రామానికి గడ్డం అప్పారావు ఎడ్లు, పశ్చిమ గోదావరి జిల్లా దుళ్ల గ్రామానికి చెందిన బడామాను శ్రీను ఎడ్లు, తూర్పుగోదావరి జిల్లా కాపరం గ్రామానికి చెందిన బండారు శ్రీను ఎడ్లు నిలిచాయి. సీనియర్స్‌లో ప్రథమ బహుమతిగా రూ.12,000, మెమెంటో.. ద్వితీయ బహుమతిగా రూ.10,000, మెమెంటో.. తృతీయ బహుమతిగా రూ.8,000 మెమెంటోలను అందజేశారు. జూనియర్స్‌లో ప్రథమ బహుమతిగా రూ.10,000, మెమెంటో... ద్వితీయ బహుమతిగా రూ.8,000, మెమెం టో.. తృతీయ బహుమతిగా రూ.6,000, మెమెంటోలను ప్రత్తిపాడు ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అందజేశారు. పోటీలను తిలకించేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌పై కొడవలితో వ్యక్తి దాడి

స్వల్ప గాయంతో తప్పించుకున్న తహశీల్దార్

పోలీసుల అదుపులో నిందితుడు



చేతికి గాయంతో తహశీల్దార్ నాగలక్ష్మమ్మ

అయినవిల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి తహశీల్దార్ కార్యాలయంలోకి చొరబడి మహిళా తహశీల్దార్‌పై దాడికి ప్రయత్నించాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని అయినవిల్లి తహశీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న తహశీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మపై తొత్తరమూడి గ్రామంలోని జోగిరాజుపాలేనికి చెందిన మీసాల సత్యనారాయణ శుక్రవారం మధ్యాహ్నం కొడవలితో కార్యాలయంలోకి చొరబడి దాడికి ప్రయత్నించగా ఆమె తప్పించుకునే క్రమంలో చేతికి గాయమైంది. వెంటనే సిబ్బంది అప్రమత్తమై సత్యనారాయణను అయినవిల్లి పోలీసులకు అప్పగించారు. అయినవిల్లి ఎస్ఐ హరికోటిశాస్త్రి సత్యనారాయణపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. సత్యనారాయణ గతంలో ఒక హత్యా నేరంపై జైలులో కూడా ఉన్నట్టు సమాచారం. బ్యాగులో ఎప్పుడూ దస్తాలు దస్తాలుగా ఫిర్యాదులు పెట్టుకుని నా భూమి ఆక్రమించుకున్నారంటూ తరచూ అధికారులు ఫిర్యాదులు చేస్తున్నాంటాడని స్థానికులు చెబుతున్నారు. ఎప్పుడూ కూడా కత్తి లేదా కొడవలిని వెంట పెట్టుకుని కాగితాలతో అలా తిరుగుతుంటాడని, వీఐపీలు వచ్చినప్పుడు వారికి దరఖాస్తులు అందించి తమ భూములు తనకు అప్పగించాలని సత్యనారాయణ కోరుతుంటాడని చెబుతున్నారు.

నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశం

అమలాపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): అయినవిల్లి తహశీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మపై జరిగిన దాడి ఘటనపై కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ స్పందించారు. తహశీల్దార్‌కు ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎడమచేతిపై చిన్న గాయమైందని ఆమె కలెక్టర్‌కు తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న అధికారిపై దాడి జరగడం బాధాకరమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నామని, నిందితుడిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ కృష్ణారావును కలెక్టర్ ఆదేశించారు. జిల్లా యంత్రాంగం అన్ని విధాలా ఆమెకు మద్దతుగా నిలుస్తుందన్నారు. అదేవిధంగా ఏపీ రెవెన్యూ జేఏసీ చైర్మన్ వాసా ఎస్.దివాకర్ తహశీల్దార్‌పై జరిగిన దాడిని ఖండించారు.

ఘనంగా చండీహోమం

అన్నవరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11 గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



అన్నవరంలో హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

పడమటిపాలెంలో సరుగుడు తోటలు దగ్ధం



దగ్ధమైన సరుగుడు తోటలు

మలికిపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం పడమటిపాలెంలో 15 మంది రైతులకు చెందిన 15 ఎకరాల్లో సరుగుడు తోటలు దగ్ధమయ్యాయి. ప్రమాదానికి కారణాలు తెలియలేదు. తోటలు అంటుకోవడంతో తాము ఎంతో నష్టపోయామని పడమటిపాలేనికి చెందిన ఆవేదన వ్యక్తం చేశారు.

అగ్నిప్రమాదంలో రెండు తాటాకిళ్లు దగ్ధం



వీఆర్‌పురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): వీఆర్‌పురం మండలం సీతంపేట గ్రామంలో శుక్రవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ముత్యాల రమేష్, ముత్యాల రాంబాబుకు చెందిన ఇళ్లు దగ్ధమయ్యాయి. ప్రమాదం జరిగినప్పుడు ఇళ్లల్లో ఎవరూ లేకపోవడంతో సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఫైడే!

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎండలు మండి పోతున్నాయి. శుక్రవారం తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో ప్రజలు అవస్థలు పడ్డారు. ఇంటి నుంచి బయటికి వెళ్లేందుకు భయపడ్డారు.



రాజమహేంద్రవరం హైవేపై ఆటోనగర్ వద్ద ఏర్పడిన ఎండమావులు



రాజమహేంద్రవరం: ఎండలో వెళ్తున్న వాహనదారులు



మల్లేపల్లిలో ఎండ దెబ్బకు నిర్మానుష్యంగా ఉన్న హైవే

గోరక్షక చట్టాలు అమలు చేయాలి

పీహెచ్‌పీ సభ్యులు, బీజేపీ నాయకులు.. వివిధ శాఖల అధికారులకు వినతులు



సీఐ వీరయ్యగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

రాజానగరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గోరక్షక చట్టాలు అమలు చేయాలని కోరుతూ విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు శుక్రవారం రాజానగరంలోని వివిధ శాఖల అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ సభ్యులు మాట్లాడుతూ హిందువులు దేవతా స్వరూపంగా భావించే గోవులను వధించి మాంసాహారంగా ఉపయోగించుకోవడం హేయమన్నారు. ఏపీ ప్రభుత్వం 1977లో గోవధను నిషేధిస్తూ తీసుకొచ్చిన ప్రత్యేక చట్టం అమల్లో ఉన్న ప్పటికీ రాష్ట్రంలో విచ్చలవిడిగా గోవధ జరుగుతోందన్నారు. ప్రధానంగా బక్రీద్ సందర్భంగా గోవధ మరి రెట్టింపు స్థాయిలో కొనసాగుతుందని, చట్టాన్ని అమలు చేయాల్సిన ప్రభుత్వ యంత్రాంగం చూసీచూడనట్టు వ్యవహరిస్తోందని ఆరోపించారు. చట్టవిరుద్ధంగా నడుస్తున్న గోవధ శాలలను మూసివేయాలని, ఆక్రమణలో ఉన్న గోచర భూములకు విముక్తి కల్పించాలన్నారు. గోహత్య నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేసేలా చర్యలు చేయాలని కోరుతూ సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్‌కు, డిప్యూటీ తహశీల్దార్ రాజుకు అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ మండలాధ్యక్షుడు ఆర్‌వీఎస్ఎస్ ప్రసాద్, జిల్లా గోరక్షక విభాగం ప్రముఖ్ దినేష్‌కుమార్, బీజేపీ నాయకులు మోది సత్తిబాబు, చవ్వా చరణ్ గుప్త, బిక్కిన కామరాజుచౌదరి, దార్ల నరసింహమూర్తి పాల్గొన్నారు.

సాగులో సాంకేతికతతో అధిక దిగుబడులు

ప్రధాన శాస్త్రవేత్త సరళ



కొంకుదురులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సరళ

బిక్కవోలు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రైతులందరూ వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడంతో పాటు వ్యవసాయ పథకాలపై అవగాహన కలిగి వుండి అధిక దిగుబడులు సాధించాలని ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సరళ సూచించారు. కొంకుదురు గ్రామ పంచాయతీ వద్ద శుక్రవారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు సర్పంచ్ సత్తి వీరమణి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగం, మట్టిలో వున్న పోషక విలువలను గుర్తించి తద్వారా ఎరువుల వినియోగం, సస్యరక్షణ, వ్యవసాయ యాంత్రీకరణ, ఉద్యాన పంటల సాగు, వరికి ప్రత్యామ్నాయ పంటల సాగు, పీఎం కిసాన్, ఆర్‌కేవీవై, ఫసల్ బీమా, కిసాన్ క్రెడిట్ కార్డు వంటి పథకాలపై అవగాహన కల్పించారు. కొమరిపాలెం డీసీ చైర్మన్ కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, మాజీ ఎంపీపీ చింతా శ్రీనివాసరెడ్డి, శాస్త్రవేత్తలు శిరీష, శోభారాణి, రఘునందన్, వ్యవసాయాధికారి శామ్యూల్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్ పేటలో టీడీపీ ఫ్లెక్సీల చించివేత



ఆర్‌ఎస్ పేటలో చించి వేసిన ఓ టీడీపీ ఫ్లెక్సీ

బిక్కవోలు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎస్ పేట గ్రామంలో కెనాల్ రోడ్‌లో ఏర్పాటు చేసిన టీడీపీ ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చించి వేశారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ వాణిజ్య విభాగ అధికార ప్రతినిధి మాడా మోహన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావడంతో ఈ నెల 4వ తేదీ ఉదయం కెనాల్‌రోడ్‌లో భారీ ఫ్లెక్సీ, మహానాడు సందర్భంగా ఈ నెల 28న ఒక ఫ్లెక్సీ ఏర్పాటు చేశామని, ఈ రెండింటిని గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి చించి వేశారన్నారు. ఫ్లెక్సీలు చించి వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

వాకర్స్ యోగా లాఫింగ్ క్లబ్.. పింఛన్ల పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ప్రాంగణం ఆనంద్ గార్డెన్స్‌లో వాకర్స్ యోగా అండ్ లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 80మంది వృద్ధులకు రూ.40 వేలు పింఛన్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు ఆధ్వర్యంలో కార్యదర్శి గుబ్బల గంగాభవాని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కె.విజయరాజ్యలక్ష్మి, రిటైర్డ్ టీచర్ రామదేవు హేమవల్లి, రూపశ్రీశివలక్ష్మీదేవి ప్రియ ఇండస్ట్రీస్ అధినేత కంటిపూడి శ్రీనివాస్‌చౌదరి చేతుల మీదుగా ఒక్కొక్కరికి రూ.500 చొప్పున రూ.40 వేలు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులకు అల్పాహారం అందించారు. క్లబ్ విద్యానిధికి మల్లిడి వీర్రెడ్డి, పడాల కొండారెడ్డి, ఆదర్శ కిట్టి పార్టీ వారు, ఎస్ఎస్‌కే పెరల్ ప్లాజా, భేరి రత్నాంబ, రాళ్లబండి సత్యవేణి, ఏవీ రమణిలు ఆర్థిక సహకారం అందించారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు

కోరుకొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ వల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి నూతన దేవాలయ ప్రాంగణం, విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఆగమ బ్రహ్మ పాణింగపల్లి సత్య పవన్ కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో పండితులు శుక్రవారం గణపతి పూజ, ప్రతిష్ఠ సంకల్పం, దీక్షా ధారణ, నవగ్రహ ఆరాధన, అకల్మషహోమం,గ్రహహోమం గోపూజ, చతుర్థ, నవ, పంచగవ్యక్షీర కలశారాధన, ప్రధానహోమాలు విశేష అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో నిడమనూరి శ్రీ వెంకట ఆదినారాయణ దంపతులు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మాలధారణ భక్తులు, ఆలయ కమిటీ, బస్టాండ్ వర్తక సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాపు భవనానికి భూమి కేటాయింపుపై హర్షం

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా కాపులంతా ఎదురు చూస్తున్న కాపు కమ్యూనిటీ భవనం నిర్మాణానికి ఇప్పటికి సాకారం కావడం పట్ల కాపు సంక్షేమ అండ్ సేవా సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం ఆనంద్ రీజెన్సీ కాటన్ హాలులో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు రామినీడి మురళీ, గౌరవ సలహాదారులు దొండపాటి సత్యంబాబు, సంఘం ప్రధాన కార్యదర్శి చిక్కం వీరబాబు మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా కాపులకు భవనం నిర్మించాలని అందుకోసం భూమిని కేటాయించాలని కోరినా అది కార్యరూపం దాల్చలేదని, అయితే పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, పూర్తిగా సహకరించారని చెప్పారు. మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా తీసుకుని బొమ్మూరు కలెక్టరేట్ సమీపంలో సర్వేనెంబరు 386/1లో 30 సెంట్ల భూమిని కాపు భవనం నిర్మాణానికి కేటాయింపజేశారన్నారు. త్వరలో పార్టీలు, రాజకీయాలకు, కాపు సంఘాలకు అతీతంగా కమిటీలు వేసి కాపు కమ్యూనిటీ హాలు, హాస్టల్ నిర్మాణాలు చేపడతామన్నారు. సమావేశంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కార్యాచరణ

జిల్లా కలెక్టర్ ప్రశాంతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు సమర్థవంతమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. రాజమహేంద్రవరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రత కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ ప్రశాంతి, జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని నివారించే క్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న భద్రత పరమైన అంశాలపై మరింతగా దృష్టి సారించాలని ఆదేశించారు. భవిష్యత్‌లో అటువంటి ప్రమాదాల నివారణకు సమర్థవంతమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదే శించారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అందుకు జాయింట్ కమిటీ ఆధ్వర్యం లో క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేయాలని స్పష్టం చేశారు. రహదారులు నిర్మాణాలు, మరమ్మతులు చేపట్టే సందర్భంలో స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసిజర్‌కు అనుగుణంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పనులు జరిగే ప్రాంతానికి 500 మీటర్ల దూరం నుంచి సూచికలు, తగిన డైవర్షన్‌లు పెట్టడం, వేగ నియంత్రణ కోసం బోర్డులు ప్రదర్శన చేయాలన్నారు. జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు జరుగకుండా తగిన లైటింగ్ వ్యవస్థ, బ్లింకర్స్ ఏర్పాటు చేసి చోదకులను అప్రమత్తం చేయడం ముఖ్యమన్నారు. సైన్‌బోర్డులతో పాటు డైవర్షన్ పెట్టడం వలన వేగ నియంత్రణ ప్రమాదనివారణ సాధ్యమౌతుందన్నారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పరిధిలో నల్లజర్ల పరిధి అత్యంత ప్రమాదాలు జరిగే ప్రదేశంగా గుర్తించామన్నారు. జిల్లాలో జరిగిన ప్రతీ ప్రమాద ఘటనపై శాఖల వారీగా విశ్లేషణ చేయాల్సి ఉంటుందన్నారు. అప్పుడే భవిష్యత్తులో అటువంటి ప్రమాదాలు నివారించేందుకు చర్యలు తీసుకోవడం సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో జిల్లా ఆర్‌అండ్‌బి అధికారి ఎస్‌బీవీ రెడ్డి, జిల్లా రవాణాధికారి ఆర్.సురేష్, పోలీస్, ఎన్‌హెచ్, వైద్య ఆరోగ్యశాఖల అధికారులు పాల్గొన్నారు.

అనంతేశ్వరునికి అన్నాభిషేకం

కడియం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కడియపులంక హరిహర మహాక్షేత్రంలో అపర్ణాసమేత అనంతేశ్వరస్వామికి శుక్రవారం అన్నాభిషేకం జరిగింది. ఆలయ 16వ వార్షికోత్సవం సందర్భంగా కమిటీ అధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ ఆధ్వర్యంలో అర్చకులు స్వామికి అభిషేకాలు, ప్రత్యేకపూజలు జరిపారు. స్వామికి అన్నాభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

కిట్‌లు సకాలంలో పాఠశాలలకు చేరాలి

- సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల రాష్ట్ర డైరెక్టర్ ప్రతాపరెడ్డి
- రంగంపేట హైస్కూల్ పరిశీలన



రంగంపేట హైస్కూల్లో విద్యార్థి మిత్ర కిట్లను పరిశీలిస్తున్న ప్రతాపరెడ్డి

రంగంపేట, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇచ్చే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు తయారీలో అప్రమత్తంగా ఉంటూ, సకాలంలో పాఠశాలలకు చేరే విధంగా కృషి చేయాలని రాష్ట్ర సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల డైరెక్టర్ ప్రతాపరెడ్డి సూచించారు. రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థి మిత్ర కిట్ల నిర్వహణ కేంద్రాన్ని ఆయన శుక్రవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. విద్యార్థి, తరగతుల వారీగా కిట్లను కట్టలుగా కట్టి పంపిణీకి సిద్ధం చేసిన సమగ్రశిక్ష ఉద్యోగులు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, సీఆర్పీలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇప్పటి వరకు బ్యాగులు, పాఠ్యపుస్తకాలు, బెల్టులు, గ్రంథాలయ పుస్తకాలు, సామగ్రి చేరిందని, వాటిని పంపిణీకి సిద్ధం చేశామని మండల విద్యాశాఖాధికారి-2 పి.మధుసూధనరావు చెప్పారు. ఈ నెల 12వ తేదీలోపు పాఠశాల స్థాయికి కిట్లు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రతాపరెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సమగ్రశిక్ష ఏఎంవో గౌరీశంకర్, మధ్యాహ్నం భోజన పథకం అసిస్టెంట్ డైరెక్టర్ వి.వెంకట్రాజు, కాకినాడ జిల్లా ఐఈ కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు, రంగంపేట క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి, మండల సమగ్ర శిక్ష ఉద్యోగులు, పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. మార్గదర్శకాలు..

- రంగంపేట గ్రంథాలయ అధికారి రామకోటేశ్వరరావు
- ముగిసిన వేసవి శిక్షణ తరగతులు
- విజేతలకు బహుమతుల ప్రదానం



రంగంపేటలో బహుమతులు అందజేసిన నాయకులు

రంగంపేట, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఉజ్వల భవిష్యత్తుకు గ్రంథాలయాలు మార్గదర్శకాలుగా దోహదపడతాయని గ్రంథాలయాధికారి నల్లమిల్లి రామకోటేశ్వరరావు అన్నారు. గ్రంథాలయాల్లో ఏప్రిల్ 28 నుంచి జూన్ 6వరకు విద్యార్థులకు నిర్వహించిన వేసవి శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా రంగంపేట శాఖాగ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రంథాలయాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరమని, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని కోరారు. బీజేపీ నాయకుడు ఉండవిల్లి మాణిక్యం ముఖ్యతిథిగా విచ్చేసి గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పుస్తక పఠనాభిలాషను పెంపొందించే లక్ష్యంతో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. 35 రోజులుగా చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్, స్పోకెన్ ఇంగ్లీషు, తెలుగు వ్యాకరణం, కథలు చెప్పడం, రాయడం, బాలల గేయాల అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు, కంపాస్‌బాక్స్‌లు, ప్రశంసా పత్రాలు బహూకరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ విశ్రాంత ఉద్యోగి పీవీ సాయివరప్రసాద్, విద్యా కమిటీ చైర్మన్ కంటిపూడి దేవి, టేకుమూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక గౌతమీ ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అరి పిరాల నారాయణరావు, రిటైర్డ్ ఓఎన్‌జీసీ జనరల్ మేనేజర్ సరస్వతి విచ్చేశారు.గ్రంథాలయ అధికారిణి ఘంటా శ్రీదేవి పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా పిల్లలకు నారాయణరావు స్టేషనరీ కిట్‌ను బహూకరించారు. పిల్లలకు అన్నిరోజులు మజ్జిగ వితరణ కు సహా యం చేసిన సరస్వతిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిల్లలకు వివిధ అంశాలను బోధించిన రాజు, దత్తాత్రేయ శర్మ, గోపాల్, గ్రంథాలయ సి బ్బంది పాల్గొన్నారు. స్థానిక సీతంపేట గ్రంథాలయంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను చెక్కా తాతారావు, ఏకృష్ణశర్మ అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్ చార్జి ఎం.వీరలింగం, డి.రాజు పాల్గొన్నారు.

రాజానగరం: స్థానిక శాఖా గ్రంథాలయం లో జరిగిన కార్యక్రమంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గ్రంథాలయం తరపున బహుమతులతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జనసైనికులు, గ్రంథాలయాధికారి కలగర సత్యనారాయణ, శిక్షకులు కాళ్ల నాగదేవి, శివకళ, రెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: సీతానగరం గ్రంథాలయంలో లైబ్రేరియన్ టి.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బి.భాస్కరరావు, ఉపాధ్యాయులు జి.శేఖర్, ఎస్.రామకృష్ణ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ లైఫ్ మెంబర్ డాక్టర్ సత్యం రమేష్‌బాబు విచ్చేసి ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యార్థులకు కథలు చెప్పడం, కథలు వినడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్ష చేయించారు. 34 రోజులు జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన వారికి ప్రశంసాపత్రాలు, మెమెంటోలు, మోడల్ బుక్స్ బహూకరించారు. కార్యక్రమంలో పలువురు పాఠకులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో బహుమతులు అందుకున్న విద్యార్థులు

యోగాతో ఆరోగ్యం

ఆర్టీసీ జిల్లా అధికారి మూర్తి

రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోలో యోగా దినోత్సవం



రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో గ్యారేజీ ఆవరణలో యోగాభ్యసనాల దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): యోగాతో శారీకంగాను, మానసికంగాను ఆరోగ్యంగా ఉండవచ్చని ఆర్టీసీ జిల్లా అధికారి వైఎస్ఎన్ మూర్తి అన్నారు. జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ముందస్తుగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో గ్యారేజీ ఆవరణలో యోగాభ్యసనాల ప్రక్రియ నిర్వహించారు. ఆర్టీసీ జిల్లా అధికారి వైఎస్ఎన్ మూర్తి, డిపో మేనేజర్ షేక్ షబ్నం, ఇతర అధికారులు, సిబ్బంది యోగా చేపట్టారు. కార్యక్రమంలో అక్కౌంట్స్ ఆఫీసర్ ఆర్‌వీ కోటేశ్వరరావు, అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్.నాగలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ విజయలక్ష్మి, కార్యాలయం సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

రాజానగరం: రాజానగరంలోని మండల పరిషత్ కార్యాలయం ఆధ్వర్యంలో యోగాంధ్రపై అవగాహన ర్యాలీ చేపట్టారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి ప్రారంభమై సాయిబాబా మందిరం, పోలీస్‌స్టేషన్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకుని, మానవహారం నిర్వహించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు, జీజీయూ విద్యార్థులు యోగా ఆవశ్యకతను ప్లకార్డులతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జేపీ ఝాన్సీ, తహశీల్దార్ జీఏఎల్ఎస్ దేవి, డిప్యూటీ ఎంపీడీవో వాణి, ఏవో సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ గంగాధర్ పాల్గొన్నారు.



రాజానగరంలో ర్యాలీ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

ప్లాస్టిక్ నిషేధం కఠినంగా అమలు

- అందుకోసం షీటీమ్స్ ఏర్పాటు
- సమీక్షలో కమిషనర్ కేతన్ గార్గ్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తామని మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం శానిటేషన్ విభాగం అధికారులు, ఇతర అధికారులతో ఆయన ప్లాస్టిక్ వినియోగ నిషేధంపై సమీక్ష నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పెషల్ ఆఫీసర్లు వార్డు పరిధిలో విస్తృతంగా పర్యటించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అమ్మే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ నిషేదానికి సంబంధించి మున్సిపల్, పోలీస్ అధికారులతో కూడిన ఐదు షీ టీమ్స్(శానిటేషన్ అండ్ హెల్త్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్స్)ను ఏర్పా టు చేసుకున్నట్టు చెప్పారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ బృందాలు పొల్యూషన్ కంట్రోల్ బోర్డుతో కలిసి పలు హోల్‌సేల్ దుకాణాలపై దాడులు నిర్వహించాయన్నారు. పిడింగొయ్యి ప్రాంతంలో శ్రీవెంకటేశ్వర హోల్‌సేల్ మార్కెట్‌లో దాడులు నిర్వహించగా సుమారు 2టన్నుల ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ బృందాలు ఇప్పటివరకు చేసిన దాడుల్లో 7.70 టన్నుల ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని రూ.12 లక్షలు జరిమానాలు విధించినట్టు కమిషనర్ చెప్పారు. ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణ పరిరక్షణలో ప్రజలు, వ్యాపారులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నూతన పార్కింగ్ ప్రదేశాల అభివృద్ధి

రాజమహేంద్రవరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా నూతన పార్కింగ్ ప్రదేశాలను అభివృద్ధి చేస్తున్నట్టు కమిషనర్ కేతన్ గార్గ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు 84 స్థలాల్లో సుమారు 75 చదరపు అడుగుల విస్తీర్ణంను గుర్తించామన్నారు. వీటిలో కొన్ని ప్రభుత్వ స్థలాలు కాగా మిగతావి ప్రవేట్ స్థలాల్లో ఏర్పాటు చేయబోతున్నట్టు తెలిపారు. అలాగే రెవెన్యూ షేరింగ్ మోడల్‌లో ఈ పా ర్కింగ్ ప్రదేశాలను అభివృద్ధి పరిచేందుకు డిప్యూటీ కమిషనర్ నేతృత్వంలో ఒక కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీలో ఎంహెచ్‌వో, సిటీ ప్లానర్, రుడా ప్లానింగ్ ఆఫీసర్, ట్రాఫిక్ పోలీస్ అధికారి సభ్యులుగా ఉంటారని కమిషనర్ పేర్కొన్నారు. ఇప్పటికే గ్రౌండ్ వర్క్ పూర్తి కాగా త్వరలో టెండర్లను ఆహ్వానిస్తామన్నారు.

బక్రీద్ శుభాకాంక్షలు

రాజమహేంద్రవరంలో పవిత్ర బక్రీద్ సందర్భంగా ముస్లింలకు కమిషనర్ కేతన్‌గార్గ్ శుభాకాంక్షలు తెలిపారు. హజరత్ ఇబ్రహీం త్యాగనిరతికి ప్రతీకగా ఈపండుగను జరుపుకుంటారని, భక్తిని, త్యాగ గుణాన్ని బక్రీద్ చాటి చెబుతుందన్నారు. అల్లాహ్ దీవెనలు ప్రజలందరిపైన వుండాలని ఆయన కోరారు.

ప్రశాంత వాతావరణంలో బక్రీద్ జరుపుకోవాలి: ఎస్పీ

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్నామని ఎస్పీ నరసింహకిషోర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రశాంతమైన వాతవరణంలో సుఖసంతోషాలతో ముస్లింలు వారి కుటుంబాలతో బక్రీద్ పండుగను జరుపుకోవాలన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధాన మసీదులు, ఈద్గాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు, సోలార్ కెమెరాలు, డ్రోన్లతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. మత పెద్దలతో సమావేశాలు ఏర్పాటు చేసి జిల్లాలో మత సామరస్యాన్ని కాపాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జంతువుల అక్రమ రవాణా, గోవధ విషయంలో హైకోర్టు ఆదేశాలు, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి ఆంధ్రప్రదేశ్ గోవధ నిర్మూలన అండ్ జంతు సంరక్షణ చట్టం 1977, జంతురవాణా నిబంధనల చట్టం 1978, నిబంధనలు 2001, జంతువధ శాలలు నిబంధనలు 2001 ప్రకారం చర్యలు తీసుకునేలా ఆయా నోడల్ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశామన్నారు. గోవధ, పశువుల అక్రమ రవాణాపై ఏదైనా సమాచారం ఉంటే డయల్ 112కు సమాచారం ఇవ్వాలని, సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ పేర్కొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల



రాజానగరం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన దివాన్‌చెరువుకు చెందిన బత్తుల నాగేశ్వరరావు శుక్రవారం కలెక్టర్ పి.ప్రశాంతిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవ సంక్షేమ, అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా నియమితులైన అనంతరం మర్యాద పూర్వకంగా కలిశామన్నారు.

జాతీయ ఉపకార వేతనాలకు పది మంది ఎంపిక

అనపర్తి జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ ఫలితాల్లో అనపర్తి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల నుంచి పది మంది విద్యార్థినులు ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం కర్రి కళ్యాణి తెలిపారు. ఈ ఏడాది జరిగిన పరీక్షల్లో ఎం.విశ్వజ, లక్ష్మీకీర్తన, లక్ష్మీ చందన, విష్ణుప్రియమణి దేవి, భవ్యశ్రీ, లహరి, హేమవల్లి, మౌనిక, శ్రావ్య, భవానిలు ఎంపికైనట్టు ఆమె తెలిపారు. వారికి ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు స్కాలర్ షిప్ అందుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి, కర్రి శేషారత్నం, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ నల్లమిల్లి విజయలక్ష్మీ, వైస్ చైర్‌పర్సన్ తాడి కవిత, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

పందలపాక నుంచి ఐదుగురు

బిక్కవోలు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపకార వేతనాలు (ఎన్ఎంఎంఎస్)కు పందలపాక ఉన్నత పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎంపికైన వారిలో వి.హిమసికార, పీఎల్.గౌతమి, వీహెచ్. లతాశ్రీ, జీవీ శ్రావణ్, వి.ధనప్రియ ఉన్నారన్నారు.

మొక్కలు నాటిన ఎమ్మెల్సీ, రాజ్యసభ ఎంపీ



రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బీజేపీ పిలుపులో భాగంగా శుక్రవారం రాజమహేంద్రవరంలోని ఎమ్మెల్సీ కార్యాలయం ఎదుట మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జిల్లా ఎత్తిపోతల పథక అధ్యక్షుడు సోమన్నకు సత్కారం

బిక్కవోలు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎత్తిపోతల పథక అధ్యక్షుడు పుట్టా సోమన్నచౌదరిని శుక్రవారం ఇళ్లపల్లిలోని విఘ్నేశ్వర ఎత్తిపోతల పథక రైతులు, రైతులు సత్కరించారు. ఈ పథకం ద్వారా ఐదు గ్రామాలకు నీరందేందుకు సోమన్న విశేషంగా కృషి చేశారని కొనియాడారు.డైరెక్టర్ భీమరాజును కూడా రైతులు సత్కరించారు.

కుటుంబ కలహాలతో గడ్డి మందు తాగిన వ్యక్తి మృతి

సీతానగరం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మం డలంలోని ఇనుగంటివారిపేట గ్రామానికి చెందిన గుడిసె రాజు(36) కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్టు హెడ్ కానిస్టేబుల్ రేలంగి శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. గుడిసే రాజు భార్య దుర్గ వేరే గ్రామానికి వెళ్లింది. కుటుంబ కలహాల నేపథ్యంలో గత నెల 29 రాత్రి 9 గంటలకు రాజు.. భార్య దుర్గకు ఫోన్ చేసి, తాను చనిపోతానని హెచ్చరించి గడ్డి మందు తాగాడు. ఇది గమనించిన రాజు అన్నయ్య వనరాజు అతడిని రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించాడు. మెరుగైన వైద్య సేవల కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం 4గంటలకు మృతి చెందాడు. ఆసుపత్రి సమాచారం, భార్య దుర్గ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ తెలిపారు.



రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 41.0 (శుక్రవారం)
కనిష్ఠం : 27.0

డీఎస్సీ 30వ తేదీ వరకు పరీక్షలు

తొలిరోజు 310 మంది గైర్హాజరు

కాకినాడరూరల్/అమలాపురం రూరల్/రాజమహేంద్రవరం అర్బన్, జూన్6(ఆంధ్రజ్యోతి): ఏపీ మెగాడీఎస్సీ-2025 ఆన్‌లైన్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు ఈనెల 30వ తేదీ వరకూ కొనసాగనున్నాయి. తొలిరోజు అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి గంటన్నర ముందు అనుమతించారు. మొదటిగా అభ్యర్థుల హాల్‌టికెట్‌తోపాటు ఫొటో గుర్తింపును పరిశీలించారు. రాజమహేంద్రవరం ఐయాన్ డిజిటల్ జోన్ ఐడీజీ లూథర్‌గిరి రాజీవ్‌గాంధీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో శుక్రవారం జరిగిన మెగా డీఎస్సీ పరీక్షలకు 1200 మంది దరఖాస్తు చేసుకోగా 1,059 మంది హాజరయ్యారని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఉదయం సెషన్‌లో 600 మందికిగాను 532 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 600 మందికిగాను 527 మంది హాజరయ్యారని కలెక్టర్ వెల్లడించారు. పరీక్షల నిర్వహణ తీరును కలెక్టర్ తనిఖీ చేశారు. కాకినాడ జిల్లాలో ఉదయం ఐదు కేంద్రాల్లోనూ, మధ్యాహ్నం ఒక కేంద్రంలోనూ జరిగినట్టు డీఈవో పి.రమేష్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి 12 వరకూ నిర్వహించిన పరీక్షకు 842 మంది హాజరుకావాల్సి ఉండగా 756 మంది, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 182 మంది హాజరుకావాల్సి ఉండగా 137 మంది హాజరయ్యారు. మొత్తం రెండు సెషన్లకు కలిపి 1024 మందికి 893 మంది హాజరుకాగా 131 మంది గైర్హాజరైనట్టు తెలిపారు. కోనసీమ జిల్లాలో తొలిరోజు శుక్రవారం డీఎస్సీ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని డీఈవో షేక్ సలీంబాషా తెలిపారు. అమలాపురం రూరల్ మండలం భట్నపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన తొలిరోజు మొదటి సెషన్ పరీక్షకు 18 మంది అభ్యర్థులు హాజరు కాలేదన్నారు. కాట్రేనికోన మండలం చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన పరీక్షలకు 20 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారన్నారు. తొలిరోజు రెండు కళాశాలల్లో మొదటి సెషన్ పరీక్షలు మాత్రమే నిర్వహించామన్నారు.



కాకినాడలో డీఎస్సీ అభ్యర్థినుల తనిఖీ..



రాజమహేంద్రవరంలో డీఎస్సీ అభ్యర్థినుల తనిఖీ..పరీక్షా కేంద్రంలో కలెక్టర్ ప్రశాంతి పరిశీలన.. రూమ్ నెంబర్ చూస్తున్న అభ్యర్థులు

నాన్న తోడుగా..

ఉండమ్మా.. పరీక్ష రాసి వచ్చేస్తా..



రాజమహేంద్రవరం విజ్ఞాన కేంద్రం భవనం

అద్భుతమే కానీ..!

విజ్ఞాన కేంద్రం చూద్దామంటే దారేది

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అదొక అద్భుతం..అయినా ఎందుకో నిర్లక్ష్యం.. నాడు వైసీపీ ప్రభుత్వంలో కోట్లు ఖర్చు పెట్టారు.. ఎందుకు కొరగాకుండా వదిలేశారు..పోనీ కూటమి ప్రభుత్వంలో అయినా పట్టించుకుంటా రనుకుంటే ఎందుకో మరి వదిలేశారు..ఎప్పుడో డిసెంబరు రెండో వారంలో అనుకుంటా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వస్తారు..ప్రారంభిస్తారని హడావుడి చేశారు.. నేటికీ ఆరంభమే కాలేదు.. కోట్లు ఖర్చు చేసి బొమ్మూరులో నిర్మించిన రాజమండ్రి విజ్ఞాన కేంద్రం (సైన్స్ మ్యూజియం) ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. ఈ నెల 10 లేదా 12 తేదీల్లో సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

పనులు ఆరంభం 2019

2017లో మంజూరైన రాజమండ్రి విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి 2018 ఫిబ్రవరి 18న అప్పటి ఎంపీ మాగంటి మురళీమోహన్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి శంకుస్థాపన చేశారు. రూ.16.82 కోట్లు అంచనా వ్యయంతో టీడీపీ ప్రభుత్వ హయాంలో 2019 ఫిబ్రవరిలో పనులు ప్రారంభించారు. కానీ ఎన్నికల సీజన్ కావడంతో పని జాప్యమైంది. ఆ తరువాత ప్రభుత్వం మారడంతో చాలాకాలంపాటు దీని ఊసే మరచిపోయారు. తరువాత ఎన్నికల ముందు హడావుడిగా పనులు ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వంలో ఏ పనిచేసినా గందరగోళమే. సైన్స్ మ్యూజియం పరిస్థితి కూడా అంతే. కోట్లు ఖర్చు పెట్టి కట్టారు వదిలేశారంతే.. నేటికి వినియోగంలోకి రాకుండా ఉంచేశారు. 2019లో ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి వచ్చింది. అప్పటికే మ్యూజియం నిర్మాణ పనులు ప్రారంభమైనా రివర్స్ టెండరింగ్ నేపథ్యంలో నిలిచిపోయాయి. సుమారు మూడేళ్లపాటు పనులు ముందుకు కదల్లేదు. నిధులున్నా పనులు నీరసమే. ఆ తరువాత పనులు ఆరంభించినా తూతూ మంత్రంగా చేసి వదిలేశారు.



భవనం లోపల ఉండే రకరకాల యంత్రాలు

నీటి ప్రయోగశాల



గ్రౌండ్‌లో డైనోసార్ బొమ్మ... ఇలాంటివి ఎన్నో..

- నేటికి ప్రారంభంకాని సైన్స్ మ్యూజియం
- 2019లోనే నిర్మాణ పనులు ఆరంభం
- వైసీపీ హయాంలో పూర్తయిన పనులు
- గతంలో పవన్ ప్రారంభిస్తారని ప్రచారం
- నిరుపయోగంగా మారిన విజ్ఞానం
- సీఎం చంద్రబాబు రాక..మళ్లీ ఊహాగానాలు

సమస్య ఉన్నా కట్టేశారు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సైన్స్ మ్యూజియం నిర్మాణానికి బొమ్మూరులో సుమారు 5 ఎకరాల స్థలం కేటాయించారు. రోడ్డు కంటే బాగా పల్లంగా ఉంటుంది. దీనిని మెరక చేయడానికి అప్పటి ఎంపీ మాగంటి మురళీమోహన్ మట్టి కూడా ఏర్పాటుచేస్తామని చెప్పారు. తర్వాత ప్రభుత్వం మారింది. అవేమీ పట్టించుకోలేదు. పల్లపు ప్రాంతంలోనే నిర్మించారు. దీనిని సరిదిద్దడానికి జిల్లా అధికార యంత్రాంగం నానా తంటాలు పడ్డారు. ప్రస్తుతం విలువైన ఈ విజ్ఞాన కేంద్రం పల్లపు ప్రాంతంలోనే ఉంది. కానీ ప్రహరీ చుట్టూ డ్రెయిన్లు తవ్వారు. ప్రహరీ లోపల, విజ్ఞాన కేంద్రం చుట్టూ వానపడినా లోపలకు నీరు వచ్చే ప్రమాదం ఉంది. అంత పల్లంగా ఉంటుంది. దీనికోసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేసి, వాన నీటిని మళ్లించే ఏర్పాట్లు చేశారు. ఎంత చేసినా ఈ విజ్ఞాన కేంద్రానికి ఇది సమస్యే. దీని నిర్మాణ సమయంలో ఏపీ కాస్ట్ అధికారులు కనీస పర్యవేక్షణా చేయలేదు. సైట్ ఆఫీసర్‌ను నియమించలేదు. డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన ఒక సూపర్‌వైజర్ నెలకో, రెండు నెలలకో ఒకసారి వచ్చేవారు. దీంతో ఇక్కడ సమస్యగా మారింది. దీంతో ఈ కేంద్రం ఎలా తెరవాలో తెలియక ప్రస్తుత ప్రభుత్వంలో మల్లగుల్లాలు పడుతోంది.. తెరిస్తే నిర్వహణ కష్టంగా ఉండనుంది. తెరవకపోతే విజ్ఞానం మూలనపడిపోతోంది. ఈనెల 12న సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో అధికారులు ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేసే అవకాశం ఉంది.

లోపలంతా అద్భుతః

ఈ విజ్ఞాన కేంద్రం చాలా బాగుంటుంది. లోపల ఒక అద్భుతమే. సైన్స్‌కు సంబంధించిన పరికరాలు.. ప్రయోగాలు ఏర్పాటుచేశారు. విద్యార్థులకు ఎంతో ఉపయుక్తం కూడా. ఇది జీప్లస్ 1గా నిర్మించారు. గ్రౌండ్‌లో మూడు రూమ్‌లు ఉన్నాయి. ఫస్ట్ ఫ్లోర్‌లో 6 గ్యాలరీలు ఉన్నాయి. ఆడిటోరియం, కాన్ఫరెన్స్ హాల్ ఉంది. సాంకేతికపరమైన 18 ఎగ్జిబిషన్లు ఉన్నాయి. ఓపెన్ గ్రౌండ్‌లో సైన్స్ పార్కు ఉంది. రన్ నియన్స్ గాలరీలో ఫిజిక్స్, మ్యాథ్స్‌కి సంబంధించి 33 విజ్ఞాన అంశాలు ఉన్నాయి. అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించిన మరో నిర్మాణం చేయనున్నారు. వాటర్ వర్రీస్ గ్యాలరీలో వర్చువల్ మ్యూజియం, మరో 35 ఎగ్జిబిషన్లు ఉన్నాయి. చిత్రాల సౌండ్ ఫైల్ల సేకరణ, ఖగోళ వస్తువులు, సాంకేతిక, శాస్త్రీయ, పారిశ్రామిక పురోగతికి సంబంధించిన 32 ప్యానెల్‌లు ఉన్నాయి. అజర్నీ విత్ లైట్ పై స్పేస్, గెలాక్సీ, సౌర వ్యవస్థ, గ్రహాలతో కూడిన 20 ప్యానెల్స్ ఉన్నాయి. డ్రోన్లు, రోబోల టెక్నాలజీని చెప్పడం కోసం రోబోటిక్ ల్యాబ్ ఉంది. ఈ విజ్ఞాన కేంద్రం అధికారిగా ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఒకరు, నలుగురు ఎడ్యుకేషనల్ ఆఫీసర్లు, టెక్నీషియన్ ఒకరిని నియమించారు. హౌస్‌కీపింగ్, సెక్యూర్టీ, ఆఫీసుబాయ్‌తో కలిపి 16 మంది పనిచేస్తున్నారు.

డీసీసీబీ చైర్మన్‌గా తుమ్మల బాబు

కాకినాడ రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : కాకినాడ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)పర్సన్ ఇన్‌చార్జిగా తుమ్మల రామస్వామి (బాబు) శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఏకాదశి మంచి ముహూర్తం కావడంతో ఉదయం 7.30 గంటల సమయంలో బాధ్యతలు స్వీకరించగా సీఈవో నరసింహారావు సంతకాలు చేయించారు. డీసీసీబీకి ఇప్పటి వరకూ జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ప్రత్యేక అధికారిగా వ్యవహరించారు. తుమ్మల బాబు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా కూటమి నాయకుల సమక్షంలో త్వరలో ప్రమాణ స్వీకార వేడుకను ఘనంగా నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ జీఎం ప్రవీణ్‌కుమార్, డీజీఎం శ్రీధర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



వెళ్లొస్తాం అంటూ.. తిరిగిరాని లోకాలకు!

వెళ్లొస్తాం.. అంటూ బయలుదేరారు.. కారులో బయలుదేరిన కుమారుడు, కుమార్తె.. మనవరాలిని.. కుటుంబీకులు సాగనంపి ఇంకా ఇంటి లోపలకు కూడా వెళ్లలేదు.. ఆ మాటలు ఇంకా చెవిలో వినపడుతూనే ఉన్నాయి.. అంతలోనే ఒక విషాదకర వార్త వారి చెవిన పడింది.. కారు చెట్టును ఢీకొనడంతో కుమారుడు, మనవరాలు మృతి చెందారన్న వార్తతో అక్కడికక్కడే కూలబడిపోయారు..

8



సత్యదేవా నర్సరీలో యోగాంధ్ర ఏర్పాట్లపై చర్చిస్తున్న జేసీ చినరాముడు, ఆర్డీవో

నేడు సత్యదేవా నర్సరీలో యోగాంధ్ర

కడియం, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : కడియం సత్యదేవా నర్సరీలో శనివారం ఉదయం 6 గంటల నుంచి యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తామని జేసీ చినరాముడు తెలిపారు. జేసీ చినరాముడు, ఆర్డీవో కృష్ణనాయక్ శుక్రవారం నర్సరీ పరిశీలించారు.నర్సరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయాలని పుల్లా చంటియ్యకు సూచించారు.అధిక సంఖ్యలో జనం యోగాకు హాజరయ్యేలా చూడాలన్నారు.యోగా ఆరోగ్యానికి మంచిదన్నారు. వారి వెంట ఏపీఎంఐపీ పీడీ దుర్గేష్, డీటీవో వెంకటాచలం,జిల్లా ఉద్యాన అధికారి సుజాత, తహశీల్దార్ సునీల్‌కుమార్, నర్సరీసంఘం అధ్యక్షుడు రత్నం అయ్యప్ప, నర్సరీ అధినేత పుల్లా పెదసత్యనారాయణ, ఎంపీడీవో కె.రమేష్, ఉద్యాన అధికారి సుధీర్‌కుమార్, నర్సరీ సంఘం డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.





ఆస్తుల.. పరినక్షణ!

కేంద్రం పట్టణ ప్రాంతాల్లో ఒక సర్వే చేస్తోంది.. ఈ సర్వే ఎంతో లాభదాయకం. యాజమాన్య వివాదాలు, దీర్ఘకాలికంగా చట్టపరమైన కేసులు పరిష్కరించుకునే అవకాశం ఉంటుంది. రోడ్లు, మురుగు కాలువలు, ఇతరత్రా మౌలిక సదుపాయాల కల్పన, ప్రాజెక్టుల అమలుకు అడ్డంకులు ఉండవు. ఆస్తులు, భూరికార్డులు పారదర్శకంగా డిజిటలైజ్డ్ విధానంలో అందుబాటులో ఉంచుతారు. నగరపాలక సంస్థ, కేంద్ర, ప్రభుత్వాల ఆస్తుల గుర్తింపునకు అవకాశం ఉంటుంది.

- దేశవ్యాప్తంగా 'నక్ష' సర్వే
- భూ వివాదాల పరిష్కారమే లక్ష్యం
- రాష్ట్రంలో 10 పట్టణాల్లో అమలు
- పైలెట్ ప్రాజెక్టుకు కాకినాడ ఎంపిక
- స్థలాలకు ఖచ్చితమైన రికార్డులు
- డిజిటలైజేషన్ చేసేలా ఏర్పాట్లు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

నగరాలు, పట్టణాల్లో భూములు, స్థలాలపై కచ్చితమైన రికార్డుల తయారీ, ఉన్న రికార్డుల నవీకరణ ద్వారా వివాదాలకు పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో కేంద్రం అడుగులు వేస్తోంది. ఈ మేరకు జాతీయ జియో స్పేషియల్ పరిజ్ఞానం ఆధారంగా పట్టణ ఆవాసాల్లో భూ సర్వే (నక్ష) పేరుతో ఈ ఏడాది సర్వే చేపట్టింది. పైలెట్ ప్రాజెక్టు అమలుకు దేశవ్యాప్తంగా 152 పట్టణ స్థానిక సంస్థలను ఎంపిక చేసి రూ.194 కోట్లు కేటాయించింది. మన రాష్ట్రంలో పది పుర, నగరపాలక సంస్థలను కేంద్రం ప్రయోగాత్మకంగా ఎంపిక చేసింది. వాటిలో ఒంగోలు, అనంతపురం,గుంటూరు,నెల్లూరు, కర్నూలు, ఏలూరు, తిరుపతి, మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థలతో పాటు మన జిల్లాలోని కాకినాడ నగరపాలక సంస్థను తొలివిడతగా కేంద్రం ఎంపిక చేసింది. వీటిలో 524 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని ఏరియల్ సర్వే చేసి 9.50 లక్షల ఆస్తులను మ్యాపింగ్ చేసి డిజిటలైజ్ చేయనున్నారు. 2026 మార్చి నెలాఖరులోపు ఈ ప్రాజెక్టు పూర్తి చేసి ప్రజలకు కార్డులు అందజేయనున్నారు. రెండో దశలో మరికొన్ని పట్టణాలు ఎంపికయ్యే అవకాశాలు ఉన్నాయి.

కాకినాడలో ముందస్తు సర్వే...

కాకినాడ నగరంలో ప్రస్తుతం ముందస్తు ఏరియల్ సర్వే నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. సర్వే ఆఫ్ ఇండియా డిపార్ట్‌మెంట్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ అనే ఓ ప్రైవేటు సంస్థ ఈ సర్వే చేపట్టనుంది. డ్రోన్స్ ఎగరవేత, జీపీఎస్ కోఆర్డినేషన్‌కు సెంట్రల్ పాయింట్లు మార్కింగ్ చేసుకున్నారు. కాకినాడలో 32 కిలోమీటర్ల మేర 20 మార్కింగ్ పాయింట్లు వేశారు. ఈ ప్రాంతాల నుంచే డ్రోన్లు ఎగరవేసి బౌండరీల ఛాయాచిత్రాలను తీసుకుంటారు.

మూడు విడతల్లో సర్వే

ఈ సర్వే మూడు విడతల్లో చేపడతారు. ప్రస్తుతం ఆ సర్వేకు సంబంధించిన శిక్షణ కార్యక్రమం మైసూరులో జరుగుతోంది. రాష్ట్రంలోని ఎంపిక చేసిన పది నగరపాలక సంస్థ డిప్యూటీ సిటీ ప్లానర్లకు వారం రోజులపాటు శిక్షణ అందిస్తున్నారు. ఈ నక్ష సర్వే మూడు దశల్లో ముగిసాక డిజిటలైజ్డ్ కార్డుతో కూడిన ఆస్తి ధ్రువపత్రం అందజేస్తారు. ఏ విధమైన సమస్య లు లేనివాటిని తొలుత సర్వే చేస్తారు. ప్రజలు తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లు, కచ్చితమైన వివరాలు అందించాలి. - **కృష్ణారావు, డీసీపీ, కాకినాడ**




పురుషోత్తపల్లిలో మూసిన బంక్..

రోడ్డు వైపున పీకేసిన బోర్డు

బోర్డు పీకేసి..బంకుకు తాళాలు

- ఆంధ్రజ్యోతి కథనంతో మూసివేత
- డీజిల్ అక్రమార్కులు పరార్
- అసలు కన్నెత్తి చూడని అధికారులు

నిడదవోలు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : డీజిల్ మాఫియా ఉలిక్కిపడింది. 'ఆంధ్రజ్యోతి' కథనంతో రహస్య స్థావరాల్లో దాక్కున్నారు. అయితే అధికారుల్లో మాత్రం చలనం లేదు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతూ అక్రమ మార్గాల్లో డీజిల్ విక్రయిస్తున్న మాఫియాపై ఆంధ్రజ్యోతిలో శుక్రవారం కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లాలోని ధవళేశ్వరం, పంగిడి, దేవరపల్లి తదితర ప్రాంతాల్లో డీజిల్ మాఫియాలో వణుకు పుట్టింది. నిడదవోలు మండలం పురుషోత్తపల్లిలో బయో డీజిల్ పేరుతో వెలిసిన బంకుకు తాళాలు వేసి వాహనాలు లోపలికి రాకుండా అడ్డంగా తాళ్లను సైతం కట్టేశారు. ఈ బంకు ఆవరణలో ఉండే ఆయిల్ డిస్పెన్సర్స్ (ఆయిల్ పంపు)నకు బరకాలు కప్పేశారు. పక్కనే ఉన్న డీజిల్ బంకు బోర్డును పీకేశారు. శుక్రవారం ఉదయం నుంచి బంకును మూసివేసి ఉంచారు. ఇంత జరుగుతున్నా మామూళ్ల మత్తో ఏమిటో కానీ అధికారులు స్పందించకపోవడం గమనార్హం. మామూళ్ల మత్తులో ఉన్నారో ఏమో కానీ.. అటు హెచ్‌పీ సంస్థ బృందం కానీ.. ఇటు జిల్లా అధికార యంత్రాంగం కానీ బంకు వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో రకరకాల వాదనలు వినిపిస్తున్నాయి.పురుషోత్తపల్లి బంకులో డీజిల్ మాఫియాపై శనివారం అధికారులేం చర్యలు తీసుకుంటారో చూడాల్సిందే మరి.



మారనుంది చూడు : పుష్కరఘాట్, హేవలాక్ బ్రిడ్జి డిజైన్

అఖండ గోదావరి ప్రాజెక్టుకు 19న శంకుస్థాపన

రాజమహేంద్రవరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకు ఈ నెల 19న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి శంకుస్థాపన చేస్తారని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.రాజమహేంద్రవరం, ధవళేశ్వరం, కడియం, కొవ్వూరు, నిడదవోలు ప్రాంతాల్లో రూ.97 కోట్లతో పర్యాటక అభివృద్ధి చేస్తారన్నారు. హేవలాక్ బ్రిడ్జి ఆధునీకరణ, పుష్కరఘాట్ ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దుతామన్నారు. కడియం నర్సరీని పర్యాటకంగా తీర్చిదిద్ది..కాలువలో బోట్‌షికార్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.నిడదవోలు కోటసత్తెమ్మ దేవాలయాన్ని తీర్చిదిద్దనున్నామన్నారు. పుష్కరఘాట్‌కు టెండర్లు పిలిచారు.



కుక్కేసి.. తరలించేసి!

కొవ్వూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : పశువులను ట్రక్‌లో క్రూరంగా తరలిస్తున్న ఇద్దరిపై కేసునమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ వెంకట్రాదిపాలెంకు చెందిన డ్రైవర్ తాండ్ర నరేష్, అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం లక్ష్మీపాలెంకు చెందిన లారీ క్లీనర్ పసాదుల దుర్గాప్రసాద్ 16 ఆవులు, 18 దూడలు, 4 ఎద్దులు 38 పశువులను ట్రక్‌లో క్రూరంగా తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం వచ్చింది. ఈ మేరకు శుక్రవారం ఉదయం సీఐ విశ్వం సిబ్బందితో కొవ్వూరు గామన్‌బ్రిడ్జి వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. బొబ్బిలి నుంచి హైదరాబాద్‌కు నంబరు ప్లేట్ లేని ట్రక్‌లో తరలిస్తున్న పశువులు, ట్రక్ స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్, క్లీనర్లపై కేసునమోదు చేసినట్టు తెలిపారు.

పేదల ఆకలి తీర్చడమే అన్న క్యాంటీన్ లక్ష్యం : ఆర్డీవో


పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేస్తున్న ఆర్డీవో రాణీసుస్మిత

కొవ్వూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : పేద వారి ఆకలి తీర్చడమే అన్న క్యాంటీన్ ముఖ్య లక్ష్యమని ఆర్డీవో రాణీసుస్మిత అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం పట్టణంలోని అన్నక్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనాలు చేస్తున్న వారిని ఆహార పదార్థాల నాణ్యత గురించి, అలాగే నిర్వాహకుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా అన్న దానిపై ఆరా తీశారు. ఆర్డీవో మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీ చేయడం జరిగిందన్నారు. క్యాంటీన్ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. ఈమెతోపాటు మున్సిపల్ కమిషనర్ టి. నాగేంద్రకుమార్, తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, తదితరులు ఉన్నారు.

బాధితురాలికి రూ. 21,400 ఆర్థిక సాయం


రక్తహీనతతో బాధపడుతున్న కనకదుర్గకు సాయం అందజేస్తున్న దేవోక్తి సోషల్ సర్వీస్ సభ్యులు

కొవ్వూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : రక్తహీనతో బాధపడుతున్న ధర్మవరం గ్రామానికి చెందిన పల్లి కనకదుర్గకు దేవోక్తి సోషల్ సర్వీస్, అబెడ్నగో సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థికసాయం అందజేశారు. ఈమె రక్తహీనత, ఫిట్స్‌తో బాధపడడంతోపాటు రెండు నెలల పాపతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె పరిస్థితి తెలుసుకున్న ఏఎస్‌వో జోడాల వెంకట్, చిడిపి దేవోక్తి సోషల్ సర్వీస్, అబెడ్నగోల సహకారంతో వాట్సప్ స్టేటస్‌లో పెట్టగా మిత్రులు, తాళ్లపూడి మండలం అంగన్వాడీలు,స్నేహితులు స్పందించి మొత్తం రూ. 21,400 వేలు విరాళాన్ని సేకరించారు. అంగన్వాడీ టీచర్ జ్యోతి మాట్లాడుతూ కనకదుర్గకు చిన్నవయస్సులో పెళ్లి జరగడంతో ఆర్థిక ఇబ్బందులు రావడం బాధాకరమన్నారు.

యోగాతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు : కమిషనర్


కొవ్వూరు సంస్కృత కళాశాలలో యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు

కొవ్వూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రోజూ యోగాను అభ్యసనం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చునని మున్సిపల్ కమిషనర్ టీ.నాగేంద్రకుమార్, తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆంధ్రగీర్వాణ విద్యాపీఠం ప్రాంగణంలోని సంస్కృత కళాశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం యోగాపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా శిక్షకులు పెనుమత్స సరోజిని సదస్సులో పాల్గొన్న వారికి యోగాపై అవగాహన కల్పించి, యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో ఎంఈవో రామకిషోర్, ఉపాధ్యాయులు కె. సౌజన్య, ఉపాధ్యాయులు, వార్డు సెక్రటరీలు, ఏఎన్ఎంలు, హెల్త్‌సిబ్బంది పాల్గొన్నారు.

'పీ4 కార్యక్రమాన్ని అమలు చేయాలి'

దేవరపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పీ4 కార్యక్రమాన్ని చేపట్టిందని, దాన్ని అమలు చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్క అధికారిపై ఉందని మండల ప్రత్యేకాధికారి ఎం.సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పీ 4 సర్వే మార్గదర్శకాలపై అధికారులతో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యతరగతి, దిగువ కుటుంబాలను బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దటానికి కావాల్సిన మార్గదర్శక సూత్రాల అమలుపై చేసిన సర్వే ఎంతో దోహదపడుతుందన్నారు. మండల నోడల్ అధికారులను నియమించటం జరిగిందని, ఈ కమిటీలో ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, విద్యాశాఖాధికారి ఎం.తిరుమలదాసు, తహశీల్దార్ శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ శివ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎస్.కుమారి, డీటీ సత్యనారాయణ, విజయలక్ష్మి, వ్యవసాయాధికారి శ్రీనివాస్, తదితరులను నియమించటం జరిగిందని ఆయన తెలిపారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు.

జాతీయ ఉపకార వేతనాలకు ఎంపిక

బిక్కవోలు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపకార వేతనాలు (ఎన్ఎంఎంఎస్)కు పందలపాక ఉన్నత పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. వి.హిమసికార, పీఎల్ గౌతమి, వి.హెచ్. లతాశ్రీ, జీవీ శ్రావణ్, వి. ధనప్రియ వున్నారు. వీరందరికీ 9వ తరగతి నుంచి ఇంటర్ పూర్తయ్యేవరకూ ఏడాదికి రూ. 12 వేలు చొప్పున కేంద్రం ఉపకార వేతనాలు అందివ్వనుంది.

ముగిసిన వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు


కొవ్వూరు: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు ప్రథమశ్రేణి శాఖగ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. సమావేశంలో చైర్‌పర్సన్ బావన రత్నకుమారి,మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సూరపనేని చిన్ని, 9వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు వేసవి విజ్ఞాన తరగతులు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ప్రతిఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. దీనిలో భాగంగా వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు. గ్రంథాలయ అధికారి జి. త్రినాథ్, ఎం.నాగమణి, వి.ప్రసాద్, ఉపాధ్యాయులు, రిసోర్స్‌పర్సన్లు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: తాళ్లపూడి శాఖా గ్రంథాలయంలో గత నెలరోజులుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారంతో ముగిశాయని గ్రంథాలయ అధికారి నరేష్ తెలిపారు. కార్యక్రమంలో పశుశాఖ వైద్యాధికారి డాక్టర్ బాలాజీ, విజేత పాఠశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ ప్రమోద్ కుమార్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రతిరోజూ నిర్వహించిన తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు గ్రంథాలయ విశిష్టత గురించి వివరించారు. పుస్తకం మన దైనందిన జీవితంలో ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. అనంతరం ఆటపాటల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

నల్లజర్ల: స్థానిక శాఖ గ్రంథాలయంలో ఏప్రిల్ 28 నుంచి ప్రారంభించిన వేసవి విజ్ఞాన శిక్షణ తరగుతలు శుక్రవారంతో ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుదె సుశీల వివిధ విభాగాల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. గ్రంథాలయ నిర్వాహకుడు రమణ, రిసోర్స్‌పర్సన్ ఖన్‌బాజీ పాల్గొన్నారు.

పెరవలి: వేసవిలో శిక్షణ తరగతుల నిర్వహణ అభినందనీయమని సలాది కృష్ణమూర్తి అన్నారు. పెరవలి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల ముగింపుసభలో ఆయన మాట్లాడారు. పిప్పర రవి, వీరవల్లి శ్రీనివాస్, సలాది శ్రీహరి,నాగిరెడ్డి నాగేశ్వరరావు, మాణికరెడ్డి, మారిశెట్టి రాంబాబు, గ్రంథాలయాధికారి వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. నెలరోజులపాటు విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ఇందులో వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు పెద్దలు మద్దిపాటి రామచంద్రరావు చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ సభ్యులు ఆకెళ్ల శ్రీనివాసరావు, సింహాద్రి శ్రీరామచంద్రమూర్తి, గ్రంథపాలకుడు ఎంవీ కృష్ణారావు, విద్యార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.


← పెరవలిలో...

వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ సరుకులు


చాగల్లులో వృద్ధురాలికి సరుకులు అందజేస్తున్న ఆర్డీవో రాణీసుస్మిత

చాగల్లు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ సరుకులు ఇంటి వద్దనే అందజేసే విధంగా తగిన చర్యలు తీసుకున్నట్టు ఆర్‌డీవో రాణీసుస్మిత తెలిపారు. శుక్రవారం మండలంలో విస్తృత స్థాయిలో ఆమె పర్యటించారు. ఊనగట్లలో వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ సరుకులను ఆమె చేతులమీదుగా అందజేసారు. అనంతరం చాగల్లులోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేసి స్టాక్‌లో ఉన్న బియ్యం, చక్కెర, పామాయిల్ నిల్వలను తనిఖీ చేశారు.

కష్టపడితే తప్పక విజయం : ఎమ్మెల్యే


గన్నికి వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, జూన్6 (ఆంధ్రజ్యోతి): శ్రమనే ఆయుధంగా చేసుకుని టీడీపీ కోసం కష్టపడి పనిచేసినవారికి తప్పక విజయం వరిస్తుందనటానికి ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులే నిదర్శనమని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. విజయవాడ ఏటీ ఫంక్షన్‌హాలులో ఆప్కాబ్ చైర్మన్‌గా గన్ని శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. దీనికి ఎమ్మెల్యే మద్దిపాటి హాజరై మాట్లాడుతూ పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు అధినాయకుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గీసిన లక్ష్మణరేఖకు కట్టుబడి గన్ని నిజాయితీగా పనిచేశారన్నారు. ఆయన కష్టాన్ని గుర్తించిన సీఎం చైర్మన్ పదవిని ఇచ్చారన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖామాత్యులు అచ్చెంనాయుడు, మాజీమంత్రి గంటా మురళి, పీతల సుజాత, ద్వారకా తిరుమల మండల అధ్యక్షుడు లంకా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నట్టు తెలిపారు.

ఎమ్మెల్యే గ్రీవెన్స్‌కు 11 ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతి శనివారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు.సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి 11 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతివారం గ్రీవెన్స్ నిర్వహించి, సమస్యల పరిష్కారానికి ఆయా శాఖల అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఘనంగా వెంకన్న కల్యాణం


ఆలయంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

దేవరపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం అంగరంగ వైభవంగా స్వామివారి కల్యాణం జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు కేశవాచార్యులు, దుర్గాప్రసాద్ ఆచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా జగన్నాథరావు బాధ్యతలు

నిడదవోలు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండల ఎంపీడీవోగా వీఎస్‌వీఎల్ జగన్నాథరావు శుక్రవారం సమిశ్రగూడెంలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తోటి సిబ్బంది ఆయనకు బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

గృహ నిర్మాణ లబ్ధిదారులకు అవగాహన సదస్సు


సదస్సులో పాల్గొన్న స్పెషల్ ఆఫీసర్ అమ్మాజీ, ఎంపీడీవో రమణ, ఏఈ శ్రీనివాస్

తాళ్లపూడి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గృహ నిర్మాణ లబ్ధిదారులకు శుక్రవారం మండల స్పెషల్ ఆఫీసర్ వై.అమ్మాజీ అధ్యక్షతన అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏపీఎం మంగాయమ్మ లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. వివిధ దశలలో ఉన్న గృహనిర్మాణ లబ్ధిదారులు 218 మందికి డ్వాక్రా ద్వారా రుణాలు ఇప్పించి వేగంగా నిర్మించేందుకు సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, డ్వాక్రా యానిమేటర్లు, మహిళా లబ్ధిదారులు పాల్గొన్నారు.

50 శాతం రాయితీపై దాణా పంపిణీ

గోపాలపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పశువుల దాణా అందిస్తే పాలదిగుబడి అధికంగా పెరుగుతుందని పశుసంవర్ధక శాఖ జేడీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పాలదిగుబడి రైతులకు 50 శాతం రాయితీపై దాణా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పశువులకు పాల దిగుబడి మరింత పెరిగి సంతానోత్పత్తి పెరుగుదలకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. పశుసంవర్ధక సహాయ సంచాలకుడు డాక్టర్ చెన్నకేశవులు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ధరిన్‌బాబు, జీ.సోమేశ్వరరావు, ఎస్‌కే.కరిష్మా, పశుసంవర్ధక శాఖ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగతనం చేసిన ఇద్దరి అరెస్టు

కొవ్వూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఇంటి తలుపులు పగలగొట్టి సెల్‌ఫోన్ దొంగతనం చేసిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పట్టణ సీఐ పి. విశ్వం తెలిపారు. వివరాల్లోకి వెళితే ఈనెల 5వ తేదీ రాత్రి యువరాజ్ కేబుల్ వీధిలో నివాసముంటున్న గవర దుర్గాసాయి ఇంటికి తాళం పెట్టి గోదావరినదిలో స్నానం చేసి వచ్చేలోగా ఇంటిలో చార్జింగ్ పెట్టిన సెల్‌ఫోను దొంగిలించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దొంగతనానికి పాల్పడిన పట్టణానికి చెందిన మోడీ వెంకటస్వామి, ప్రకాశం జిల్లా దర్శికి చెందిన పులిమి బసవయ్యను శుక్రవారం అరెస్టు చేశారు.

జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం


నల్లజర్లలో ప్రత్యేక పూజలు చేస్తున్న పార్టీ నియోజకవర్గ కన్వీనర్ సువర్ణరాజు

నల్లజర్ల జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయాన్ని నల్లజర్లలో శుక్రవారం ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు, జిల్లా కార్యదర్శి అచ్యుత సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ప్రత్యేకపూజలు చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు, నిత్యం వారికి అందుబాటులో ఉండేందుకు ఈ కార్యాలయం ఎంతో ఉపయోగ పడుతుందని సువర్ణరాజు, సత్యనారాయణ పేర్కొన్నారు. జనసేన ఎల్లప్పుడూ ప్రజల వైపే ఉంటుందన్నారు. ప్రజలు నేరుగా పార్టీ కార్యాలయానికి వచ్చి తమ సేవలను వివరించవచ్చున్నారు. కార్యక్రమంలో కవులూరు సత్తిబాబు, గుడిశె శివకృష్ణ, సెంథిల్ కుమారి, సౌజన్య, రుద్రా శ్రీను, జీ. వరుణ్‌కుమార్, కొత్తపల్లి హరిబాబు, గద్దె తిలక్, బండి చిట్టినాయుడు, దుర్గాప్రసాద్ , తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథక కార్మికులకు ఒక్కరోజు శిక్షణ


కార్మికులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

కొవ్వూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన ఆహారాన్ని వేడిగా అందించాలని ఆ పథకం జిల్లా కోఆర్డినేటర్ డీ. రామకృష్ణ ఆదేశించారు. గవర్నమెంట్ హైస్కూల్‌లో శుక్రవారం మండలంలోని 53 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన మధ్యాహ్న భోజన పథక కార్మికులకు ఒక్కరోజు శిక్షణఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన వంట పాత్రల వినియోగం, తదితర వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో -1 బీఎస్ స్వరూప్, ఎంఈవో-2 రామకిషోర్, ఫైర్ సిబ్బంది కె. విజయరత్నం, సీహెచ్‌వో బీవీ లక్ష్మి, రజియా, డి. సతీష్, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నుంచి బయలుదేరిన ఐదు నిమిషాల్లోనే ...

• చెట్టును ఢీకొట్టిన కారు... అక్కడికక్కడే ఒకరి మృతి..
చికిత్స పొందుతూ చిన్నారి దుర్మరణం • పోతవరంలో విషాదఛాయలు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

నల్లజర్ల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతవరం- యర్నగూడెం రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో మేనమామ, మేనకోడలు మృతిచెందారు. ఇంటి నుంచి బయలుదేరిన ఐదు నిమిషాల్లోనే మృత్యువు కబలించింది. ఈ హృదయవిదారకర ఘటనతో ఆ కుటుంబం భోరున విలపిస్తుంది. స్థానికుల వివరాల ప్రకారం పోతవరం గ్రామానికి చెందిన మల్లేశ్ (22) తన తల్లి రత్నకుమారి, చెల్లి అంకిత, మేనకోడలు ప్రియాఆర్షి (3)తో కలిసి తన కారులో నిడదవోలు దగ్గర కలవచర్లలో జరిగే ఓ శుభకార్యానికి బయలు దేరారు. ఈ క్రమంలో పోతవరం-యర్నగూడెం గ్రామాల మధ్య రహదారి పక్కన ఉన్న వేపచెట్టును కారు బలంగా ఢీకొంది. దీంతో మల్లేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు.


మల్లేశ్,ఆర్షి (ఫైల్)

గాయపడ్డ ఆర్షి, రత్నకుమారి, అంకితను ఏలూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆర్షి మృతి చెందింది. మల్లేశ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల గ్రామంలో జరిగిన జాతరకు వచ్చి కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపాడు. పోతవరంలో విషాదఛాయలు అలముకున్నాయి. పోలీసు కేసు నమోదు కాలేదు.

పట్టణ, సర్కిల్ పోలీస్‌స్టేషన్లకు రెండు డ్రోన్ కెమెరాల బహూకరణ


పట్టణ పోలీస్‌స్టేషన్‌కు కెమెరాలను అందజేస్తున్న అపుస్మా నాయకులు

కొవ్వూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు పట్టణ, రూరల్ సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు, ట్రాఫిక్ నియంత్రణకు అపుస్మా అందించిన డ్రోన్ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని పట్టణ సీఐ పి. విశ్వం అన్నారు. శుక్రవారం పట్టణ పోలీస్టేషన్‌కు 1, రూరల్ సర్కిల్‌కు 1 చొప్పున డ్రోన్ కెమెరాలను అపుస్మా కొవ్వూరు జోన్ నాయకులు అందజేశారు. కొవ్వూరు జోన్ అపుస్మా పరిధిలోని కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి మండలాల్లోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సహకారంతో రూ. మూడు లక్షలతో కొనుగోలు చేసినట్టు ఆ సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో అపుస్మా స్టేట్ ఈసీ మెంబర్ వి. నెల్సన్ ఆంటోని, కొవ్వూరు జోన్ అపుస్మా అధ్యక్షుడు వీవీ అనిష్, సెక్రటరీ వెంకటరత్నం, మాజీ ఈసీ సభ్యులు ముద్రగడ రవిచంద్ర, నున్న సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తాడిపర్రులో సోమేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ


ధ్వజస్థంభం ప్రారంభించిన దృశ్యం

ఉండ్రాజవరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తాడిపర్రులో పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ శుక్రవారం వేదమంత్రోచ్చారణలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు, సమస్త విగ్రహ యంత్ర పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే జీఎస్ శ్రీనివాసనాయుడు విచ్చేశారు. అలాగే పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు పెండ్యాల గోవిందరావు, సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు, స్థానికులు మట్టా చంటి, నందిన వీరరాఘవులు, భక్తులు, గ్రామస్థులు , తదితరులు పాల్గొన్నారు.

'ఇళ్లు నిర్మించుకునేందుకు చర్యలు తీసుకుంటాం'

ఉండ్రాజవరం, జూన్6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం పాలంగిలో జరిగిన హౌసింగ్ లబ్ధిదారుల అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందని, వాటిలో గృహాలు నిర్మించుకునేందుకు ముందుకు వస్తే నివేదిస్తామన్నారు. ఇళ్లు మంజూరు చేసిన తర్వాత గృహాలు నిర్మించుకోవాలని ఆయన సూచించారు. ఎంపీడీవో వీఎస్ రామారావు మాట్లాడుతూ ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల సరిహద్దులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. నిర్మాణ లబ్ధిదారుల గృహనిర్మాణాలు మంజూరు చేసేందుకు జాబితాలను ఉన్నతాధికారులకు పంపిస్తామని చెప్పారు. తమ స్థలాలు గుర్తించి సరిహద్దురాళ్లను ఏర్పాటుచేయాలని లబ్ధిదారులు కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎం.సందీప్, హౌసింగ్ ఏఈ బి. ఏడుకొండలు,గ్రామసర్పంచ్ బొక్కా శ్రీనివాస్, కూటమి నాయకులు ఈడ్పుగంటి ఉదయకుమార్, వసంతవాడ ఫణికుమార్, పంచాయతీ కార్యదర్శి ఎండీ హసన్ జానీ, వార్డుసభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెరవలి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కడియం మండలం కడియపులంకకి చెందిన కత్తుల మహేష్ సుందర్ (19) అనే యువకుడు శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. తన స్నేహితుడు శీలం అంజిబాబుతో కలిసి కడియం నుంచి తేతలిలోని బంధువుల ఇంటికి మోటారు సైకిల్‌పై వెళ్లి వస్తుండగా అన్నవరప్పాడు బీసీ కాలనీ సమీపంలో మోటార్ సైకిల్ వేగాన్ని అదుపు చేయలేక డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మహేష్ సుందర్ తీవ్రంగా గాయపడి హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. అంజిబాబుకి తీవ్రగాయాలైనట్టు సమాచారం. మృతుడి తండ్రి కత్తుల నాగరాజు ఫిర్యాదు మేరకు పెరవలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా సోమాలమ్మ జాతర ప్రారంభం

కొవ్వూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : నందమూరు గ్రామదేవత సోమాలమ్మ వారి జాతర మహోత్సవాలను శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గరగ నృత్యాలు, అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం బలిచేట, ఆదివారం జాతర ముగింపు ఉంటుందని వారు పేర్కొన్నారు. 12 సంవత్సరాలు తరువాత మూడు రోజుల పాటు జాతర నిర్వహిస్తుండడంతో గ్రామమంతా సుందరంగా అలంకరించారు.

భూగర్భజలాల పెంపునకు చెరువుల అభివృద్ధి అనివార్యం

గోపాలపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): భూగర్భజలాల పెంపునకు చెరువుల అభివృద్ధి అనివార్యమని ఐటీసీ కంపెనీ ప్రతినిధి ప్రశాంత్ కుమార్ జోషి అన్నారు. రెవెన్యూ పరిధిలోని అంకమ్మచెరువు అభివృద్ధికి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జోషి మాట్లాడుతూ భూగర్భజలాల పేరుతో పాటు పర్యావరణ పరిరక్షణకు చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ సందర్భంగా అంకమ్మచెరువు పనులు పునఃప్రారంభించి ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు ఆర్ఎం కేఎల్‌కే.ప్రసాద్, కొయ్యలగూడెం పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి గ్రేసి, రైతులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాల్టీ పరిధిలో ఆధార్ స్పెషల్ క్యాంపులు

కొవ్వూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు పురపాలక సంఘం పరిధిలో ఈనెల 10 వ తేదీ నుంచి 27 వరకు ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. 10వ తేదీన క్రిస్టియన్‌పేట సచివాలయం, 11వ తేదీన గౌతమీనగర్ - 1 సచివాలయం, 12వ తేదీన ఔరంగాబాద్ సచివాలయం, 13 వ తేదీన ఎన్‌జీవో హోమ్ 1&2 సచివాలయాలు, 24వ తేదీన ఏబీ ఎన్ కళాశాల, 25వ తేదీన ప్రభుత్వ జూనియర్ కళాశాల, 26వ తేదీన ఏఎన్‌జడ్పీ బాలికల జూనియర్ కళాశాల, 27వ తేదీన మున్సిపల్ హైస్కూళ్లల్లో ఈ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

నిడదవోలు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజీవయ్యనగర్‌లో నివాసముంటున్న ఊబా శరణ్య (22) తన భర్తతో గొడవపడి గురువారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీనిపై శుక్రవారం పట్టణ ఎస్సై జగన్మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి స్వగ్రామంచాగల్లు మండలం ధారవరం.